


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 146 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు శనివారం 31 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :146 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SAT 31 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

ఫిబ్రవరి 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు...

## 14న బడ్జెట్!

- నోటిఫికేషన్ జారీ చేసిన గవర్నర్ అబ్దుల్ నజీర్
- ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగం
- ఫిబ్రవరి 14న వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టనున్న ఆర్థిక మంత్రి పయ్యావుల
- అదే రోజున వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పించనున్న మంత్రి అచ్చెన్నాయుడు
- దాదాపు నాలుగు వారాల పాటు కొనసాగనున్న సమావేశాలు




**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. 16వ శాసనసభ ఐదో సమావేశాలను ఫిబ్రవరి 11వ తేదీ నుంచి నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ అసెంబ్లీ సమావేశాలపై నోటిఫికేషన్ జారీ చేశారు. ఫిబ్రవరి 11న ఉదయం 10 గంటలకు అమరావతిలోని వెలగపూడిలో ఉన్న అసెంబ్లీ హాలులో ఉభయ సభలను (శాసనసభ, శాసనమండలి) ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించడంతో ఈ సమావేశాలు అధికారికంగా ప్రారంభం కానున్నాయి.

గవర్నర్ ప్రసంగం అనంతరం, సభలో ఆయనకు ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరుగుతుంది. ఫిబ్రవరి 12న ఈ తీర్మానంపై చర్చ ప్రారంభం కానుండగా, ఫిబ్రవరి 13న ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ చర్చకు సమాధానం ఇస్తారు. ఈ సమావేశాల్లో అత్యంత కీలకమైన 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను

ఫిబ్రవరి 14న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సభలో ప్రవేశపెట్టనున్నారు. అదే రోజున వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌ను సమర్పిస్తారు. దాదాపు నాలుగు వారాల పాటు ఈ సమావేశాలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌కు శాసనసభ ఆమోదం పొందడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశం.




## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- బాంబు బెదిరింపుతో ఇండిగో విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్
- కువైట్-ఢిల్లీ ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు
- అహ్మదాబాద్‌లో అత్యవసరంగా ల్యాండ్ అయిన విమానం
- టిష్యూ పేపర్‌పై చేతిరాతతో ఉన్న బెదిరింపు సందేశం గుర్తింపు
- ప్రయాణికులంతా సురక్షితం, తనిఖీల్లో ఏమీ లభించలేదు
- ఘటనపై కొనసాగుతున్న దర్యాప్తు, విమాన ప్రయాణంపై అనిశ్చితి

- మిగతా 2లో...



## నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ సిఫార్సులు రావు

- పనిలో అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్న పవన్
- గత ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖను పూర్తిగా నాశనం చేసిందని విమర్శలు
- వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపణ
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**"నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ ఒత్తిడులు గానీ, సిఫార్సులు గానీ ఉండవు. కష్టపడి పనిచేసే అధికారులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు... ప్రతి అధికారి నిబంధనలకు లోబడి మాత్రమే పని చేయాలి" అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ అధికారులకు స్పష్టం చేశారు. పనిలో అలసత్వాన్ని, నిర్లక్ష్యాన్ని ఏ మాత్రం సహించేది లేదని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైనా కఠినంగా వ్యవహరిస్తామని ఆయన గట్టిగా హెచ్చరించారు.

- మిగతా 2లో...




## సిగాచి బాధితులకు పరిహారం.. ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం

- సిగాచి ఫార్మా ప్రమాద బాధితుల పరిహారంపై హైకోర్టు అసహనం
- ప్రభుత్వం తీరుపై ప్రధాన న్యాయమూర్తి తీవ్ర ఆగ్రహం
- పరిహారం ఎప్పుడు, ఎంత ఇస్తారో చెప్పాలంటూ ప్రశ్నలు
- కంపెనీతో పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ డైరెక్టర్లకు నోటీసులు

**పెన్ పవర్ డెస్క్:**సంగారెడ్డి జిల్లా సిగాచి ఫార్మా కంపెనీ ప్రమాద బాధితులకు పరిహారం చెల్లింపు విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై తెలంగాణ హైకోర్టు మరోసారి తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. పరిహారం పంపిణీలో జాప్యం, స్పష్టత లేకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. గతేడాది సంగారెడ్డి

- మిగతా 2లో...

## పదేళ్లలో అమరావతి, గుంటూరు, విజయవాడ కలిసిపోతాయి

- గుంటూరు జీజీహెచ్‌లో మాతాశిశు కేంద్రాన్ని ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- ఆర్థిక అసమానతలు తగ్గించేందుకే పీ4 కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్లు వెల్లడి
- రాష్ట్రవ్యాప్తంగా ప్రజల ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ కోసం 'సంజీవని' ప్రాజెక్టుకు శ్రీకారం

- మిగతా 2లో...



ప్రాణాలు తీసేందుకే లడ్డూల్లో విష రసాయనాలు..

## వైసీపీ మహాపాపం చేసింది

### టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు



- హిందువుల ప్రాణాలతో చెలగాటమాడేందుకే ఈ కుట్ర అని సంచలన ఆరోపణ
- వైసీపీ హయాంలో 20 కోట్ల లడ్డూలు కల్తీ నెయ్యితో తయారయ్యాయని వెల్లడి
- రూ.250 కోట్ల అవినీతి జరిగిందని, నెయ్యిలో జంతు కొవ్వు కూడా ఉందని వ్యాఖ్య
- జగన్, వైసీపీ నేతలు హిందూ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్

- మిగతా 2లో...

## తిరుమల లడ్డూ నెయ్యిలో జంతువుల కొవ్వు లేదు.. తేల్చిచెప్పిన సీబీఐ..

**పెన్ పవర్ డెస్క్:**తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణలపై విచారణ చేసిన సీబీఐ.. సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్.. తన నివేదికను వెల్లడించింది. సుదీర్ఘ విచారణ తర్వాత.. తిరుమల

- మిగతా 2లో...






## విశాఖలో చంద్రబాబు కుటుంబం భూదోపిడీకి తెరలేపింది

- జీవీఎంసీ ధర్నాచౌక్ వద్ద వైసీపీ నిరసనలు
- గీతం యూనివర్శిటీ భూదోపిడీని అరికట్టాలని నినాదాలు
- ప్రజల ఆస్తులను కాపాడటమే తమ లక్ష్యమన్న బొత్స

**పెన్ పవర్ డెస్క్:**విశాఖలోని గీతం యూనివర్సిటీ భూములపై వైసీపీ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టాయి. జీవీఎంసీ ధర్నాచౌక్ వద్ద శాంతియుతంగా నిరసనలు చేపట్టారు. గీతం యూనివర్సిటీ భూదోపిడీని అరికట్టాలని ఈ సందర్భంగా

- మిగతా 2లో...

## ఏపీ- తెలంగాణ జల వివాదం.. ఢిల్లీలో ఉన్నతస్థాయి కమిటీ భేటీ



**పెన్ పవర్ డెస్క్:**ఏపీ,తెలంగాణ మధ్య జల వివాదాల పరిష్కారానికి సీడబ్ల్యూసీ చైర్మన్ అధ్యక్షతన ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ ఢిల్లీలో భేటీ అయ్యింది. ఈ సమావేశానికి కమిటీలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో పాటు కృష్ణా గోదావరి బోర్డుల చైర్మన్లు జాతీయ నీటి అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజనీర్ హాజరయ్యారు. ఏపీ తరపున సలహాదారు ఎం. వెంకటేశ్వరరావు, ఇంజనీరింగ్ చీఫ్ నరసింహమూర్తి , చీఫ్ ఇంజనీర్ సుగుణాకర్, సూపర్డెంట్ ఇంజనీర్ గంగాధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామచంద్రరావు, కె, రమేష్ హాజరయ్యారు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న జలవివాదాల పరిష్కారానికి

- మిగతా 2లో...

## కుటుంబాన్ని మధ్యలోకి లాగొద్దు.. ఎలాన్ మస్క్‌పై వినోద్ ఖోస్లా ఫైర్

- ఎలాన్ మస్క్‌పై మరోసారి విరుచుకుపడ్డ వినోద్ ఖోస్లా
- జాతివివక్ష వ్యాఖ్యలు చేసి కుటుంబాన్ని అడ్డుపెట్టుకోవద్దని హితవు
- 'వైట్ అమెరికా గ్రేట్ ఎగైన్'కు మద్దతిస్తున్నారని ఖోస్లా ఆరోపణ
- భారత సంతతి భాగస్వామి గురించి ప్రస్తావిస్తూ మస్క్ కౌంటర్
- ఇద్దరు టెక్ బిలియనీర్ల మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం

- మిగతా 2లో...



## ఎడిటర్ వ్యూ

### సీపీఆర్‌పై.. అవగాహన అవసరం!

నేటి సమాజంలో హార్ట్ అటాక్ అనేది వృద్ధులకు మాత్రమే పరిమితమైన సమస్య కాదు. యువత, మధ్య వయసువారు, పిల్లలు కూడా అకస్మాత్తుగా గుండెపోటుకు గురవుతున్న ఘటనలు రోజురోజుకు పెరుగుతున్నాయి.. ఇది కేవలం వైద్య సమస్య కాదు. ఇది ఒక సామాజిక అత్యవసర సమస్యగా మారింది. వైద్య నిపుణులు చెప్పే దాని ప్రకారం హార్ట్ అటాక్ వచ్చిన వెంటనే సరైన సమయంలో సీపీఆర్ (కార్డియో పల్మనరీ రెసస్కిటేషన్) చేయగలిగితే ప్రాణాలు కాపాడే అవకాశాలు చాలా ఎక్కువ.. సీపీఆర్ అనేది గుండెపోటు లేదా శ్వాస ఆగిపోయిన అత్య వసర స్థితిలో ప్రాణాలను రక్షించే ప్రాథమిక వైద్య ప్రక్రియ కానీ దురదృష్టవశాత్తు, మన సమాజంలో సీపీఆర్‌పై అవగాహన చాలా తక్కువగా ఉంది. ఎవరైనా కుప్పకూలినప్పుడు ప్రజలు సహాయం చేయకుండా భయంతో, అయోమయంలో నిలబడిపోతున్నారు. కొందరు వీడియోలు తీయడంలో నిమగ్నమవు తున్నారు. మరికొందరు 'ఏం చేయాలో తెలియదు' అంటూ విలువైన నిమిషాలను వృథా చేస్తున్నారు.. ఈ నిర్లక్ష్యమే అనేక ప్రాణ నష్టాలకు కారణమవుతోంది. హార్ట్ అటాక్ తర్వాత మొదటి ఒక గంటను వైద్యులు "గోల్డెన్ అవర్"గా పేర్కొంటారు. ఈ కీలక సమయంలో సీపీఆర్ ప్రారంభమైతే, వెంటనే హాస్పిటల్‌కు తరలిస్తే, బాధితుడు మళ్లీ సాధా రణ జీవితానికి చేరుకునే అవకాశముంది. కానీ అవగాహన లేనందున ఆ గోల్డెన్ అవర్ మన చేతుల మధ్యనే జారిపోతోంది. సీపీఆర్ అవసరం కేవలం హార్ట్ అటాక్‌లకే పరిమితం కాదు.. వైద్య నిపుణుల ప్రకారం, కరెంట్ షాక్ తగిలి వ్యక్తి స్పృహ కోల్పోయి శ్వాస ఆగిపోయిన పరిస్థితిలో, పరిసరాలు సురక్షితంగా ఉన్నట్లయితే సీపీఆర్ చేయవచ్చు.. అయితే ముందుగా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిపివేయడం అత్యంత ముఖ్యం. ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన ముఖ్యమైన స్టెప్స్. ఎవరైనా అకస్మాత్తుగా కుప్పకూలితే ఈ విధంగా చేయాలి. స్పందన ఉందా లేదా చూడాలి. వ్యక్తిని పిలిచి, భుజాన్ని మెల్లగా కదిలించి స్పందిస్తున్నాడా చూడాలి. శ్వాస ఉందా లేదా పరిశీలించాలి. ఛాతీ కదులుతోందా శ్వాస వస్తోందా..? లేకపోతే వెంటనే చర్య తీసుకోవాలి. వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేయాలి.. ఇది అత్యంత కీలకమైన దశ. ఛాతిపై ఒత్తిడి ఇవ్వాలి. బాధితుడిని సమానంగా ఉన్న నేలపై పడుకోబెట్టాలి. ఛాతి మధ్యభాగంపై రెండు చేతులు ఉంచి నిమిషానికి సుమారు 100-120 సార్లు 5-6 సెం.మీ లోతుగా ఒత్తిడి ఇస్తూ ఆపకుండా కొనసాగించాలి. శ్వాస ఇచ్చే పద్ధతి తెలిసి ఉంటే మాత్రమే ఇవ్వాలి.. తెలియని వారు కేవలం ఛాతి ఒత్తిడినే కొనసాగించినా సరిపోతుంది. ఇక్కడ ప్రభుత్వ వ్యవస్థ బాధ్యత మరింత అవసరం. పోలీస్ శాఖ, ఆరోగ్య శాఖ కలిసి సీపీఆర్‌పై విస్తృత అవగాహన కార్య క్రమాలు చేపట్టాలి.. పాఠశాలలు, కళాశాలలు, గ్రామ సభలు, బస్టాండ్‌లు, కార్యాలయాలు వంటి ప్రజలు ఎక్కువగా చేరే ప్రాంతాల్లో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వాలి. సీపీఆర్ అనేది డాక్టర్లకే కాదు, ప్రతి సాధారణ పౌరుడికీ తెలిసి ఉండాల్సిన మౌలిక జీవన నైపుణ్యంగా మారాలి. ఇది ఖర్చుతో కూడిన కార్యక్రమం కాదు. కానీ దీని వల్ల లభించే ఫలితం అమూల్యమైనది ఒక మనిషి ప్రాణం. ప్రభుత్వం మాత్రమే కాదు.. మీడియా, స్వచ్ఛంద సంస్థలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు అందరూ కలిసి సీపీఆర్ అవగాహనను ఉద్యమంలా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. సీపీఆర్ ఒక జీవన రక్షణ విద్య. ఇప్పుడు నేర్చుకోకపోతే తర్వాత పశ్చాత్తాపమే మిగులుతుంది.

### నా వైపు నుంచి ఎలాంటి రాజకీయ సిఫార్సులు రావు

- మొదటి పేజీ తరువాయి

గత ప్రభుత్వంలో పనిచేసిన కొంతమంది అధికారులు ఇంకా పాత నాయకులతో సంబంధాలు కొనసాగిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, ప్రభుత్వ పాలసీల అమలులో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.ప్రజల సంతోషం, సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రభుత్వ ఆశయాలను ప్రజలకు చేరవేయడంలో అధికారులు చిత్తశుద్ధితో, జవాబుదారీతనంతో వ్యవహరించాలని పవన్ కల్యాణ్ కోరారు. శుక్రవారం నాడు విశాఖపట్నం కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్ డబ్ల్యూ ఎస్, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకం, పల్లెపండగ 1.0, 2.0, జల్ జీవన్ మిషన్ వంటి పథకాల పురోగతిపై ఆరా తీశారు. లక్ష్యాలను ఎందుకు పూర్తి చేయలేకపోయారనే దానిపై అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు.ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ, "కూటమి ప్రభుత్వం ప్రతి అడుగులో ప్రజలకు మంచి చేయాలన్న లక్ష్యంతో ఉంది. నాకు చప్పట్లు, పొగడ్తలు అవసరం లేదు. పని మాత్రమే కావాలి. ఉన్నత స్థాయి అధికారి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయాలి" అని అన్నారు.గత ప్రభుత్వంపై ఆయన తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. "గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది. పంచాయతీల్లో స్వపరిపాలనకు చోటు లేకుండా చేసి, ఆర్థిక క్రమశిక్షణ లేకుండా వేల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది. జల్ జీవన్ మిషన్ లక్ష్యాలను నీరుగార్చి, రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేశారు. పనులు చేసినట్టు రికార్డులు సృష్టించారు గానీ, ఒక్క ఇంటికి కూడా నీరు ఇచ్చిన దాఖలాలు లేవు" అని ఆరోపించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకుంటూ, వ్యవస్థలను బలోపేతం చేస్తూ ముందుకు వెళుతున్నామని తెలిపారు.పంచాయతీరాజ్ శాఖను ప్రభావవంతమైన శాఖగా తీర్చిదిద్దేందుకు సంస్కరణలు అమలు చేస్తున్నామని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న 10 వేల ప్రమోషన్లను ఎలాంటి ప్రలోభాలకు తావులేకుండా పూర్తి చేసి తమ చిత్తశుద్ధిని చాటుకున్నామని పవన్ గుర్తుచేశారు. ఉమ్మడి కడప జిల్లాలో ఓ ఎంపీడీవోపై దాడి జరిగితే స్వయంగా వెళ్లి భరోసా ఇచ్చామని, ఉద్యోగులకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి ఎంతో కష్టపడుతున్నామని, కేంద్రం నుంచి నిధులు సాధిస్తున్నామని, తమ కష్టానికి సార్థకత చేకూరేలా అధికారులు పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఉపాధి హామీ పథకం డైరెక్టర్ షణ్ముఖ్ కుమార్, విశాఖపట్నం కలెక్టర్ డా. ఎ. మల్లికార్జున, వివిధ శాఖల రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పదేళ్లలో అమరావతి, గుంటూరు, విజయవాడ కలిసిపోతాయి

ఎంత ఎత్తుకు ఎదిగినా పుట్టిన గడ్డను మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు అందిస్తున్న సేవలు ఎంతో స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్)లో పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన 'కానూరి-జింఖానా' మాతాశిశు సంరక్షణ కేంద్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రం నిర్మాణం కోసం గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థులు ఏకంగా రూ.100 కోట్లు విరాళంగా సమకూర్చగా, ప్రభుత్వం పరికరాలు, ఫర్నిచర్ కోసం మరో రూ.27 కోట్లు వెచ్చించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ, "సంపాదించిన దానిలో కొంత సమాజ సేవకు కేటాయించినప్పుడు కలిగే సంతృప్తి మాటల్లో చెప్పలేనిది. సమాజంలో ఇంకా మంచితనం మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారు. సాధారణంగా దశాబ్దాల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడిన వారు జన్మభూమిని మరచిపోతారు. కానీ మీరు చదువుకున్న కళాశాలను గుర్తుపెట్టుకుని 1981లోనే జింఖానా సంస్థను ఏర్పాటు చేసి ఇంత పెద్ద ఎత్తున సాయం చేయడం అభినందనీయం. భవన నిర్మాణంతో పాటు, భవిష్యత్తులో దాని నిర్వహణకు ఆటంకాలు రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం మీ ముందుచూపునకు నిదర్శనం" అని ప్రశంసించారు.

**పేదల అభ్యున్నతికే 'పీ4'**

రాష్ట్రంలో ఆర్థిక అసమానతలను తగ్గించే లక్ష్యంతోనే తాను 'పీ4' (ప్రజా భాగస్వామ్యంతో పేదరికంపై గెలుపు) కార్యక్రమాన్ని తీసుకొచ్చానని ముఖ్యమంత్రి వివరించారు. "కేంద్ర ప్రభుత్వం రహదారులు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాల కోసం పీ4 మోడల్‌ను ప్రోత్సహిస్తోంది. కానీ నేను పేదల అభ్యున్నతి కోసం పీ4ను అమలు చేస్తున్నాను. పేదలు సంపాదించే స్థాయికి చేరితేనే సమాజంలో ఆర్థిక వ్యత్యాసాలు తగ్గుతాయి. చదువు అనేది ఒక గేమ్ ఛేంజర్. అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి మహనీయులు ఆర్థిక సాయంతోనే ఉన్నత స్థాయికి చేరారు. పీ4 కార్యక్రమం ద్వారా ఇప్పటికే 10.42 లక్షల మందిని లక్షా 2 వేల మంది దాతలు దత్తత తీసుకున్నారు. ప్రవాసాంధ్రులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై పేదలకు అండగా నిలవాలి" అని పిలుపునిచ్చారు.

**అమరావతిపై దార్శనికత.. అభివృద్ధిపై ధీమా**

రానున్న పదేళ్లలో గుంటూరు, అమరావతి ప్రాంతాల రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. "గుంటూరు, మంగళగిరి, విజయవాడ కార్పొరేషన్లు కలిసిపోతాయి. 182 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డు రానుంది. అమరావతిని ప్రపంచ స్థాయి నగరంగా నిర్మించాలన్నది నా లక్ష్యం. ఒకప్పుడు సైబరాబాద్ నిర్మించాం, ఇప్పుడు అమరావతిలో 'క్వాంటమ్ వ్యాలీ'కి శ్రీకారం చుడుతున్నాం. 2047 నాటికి స్వర్ణాంధ్ర లక్ష్య సాధనతో ముందుకు వెళుతున్నాం" అని అన్నారు. 1995లో తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చామని, నేడు దేశం విద్యుత్ రంగంలో అగ్రగామిగా నిలవడం గర్వకారణమని పేర్కొన్నారు.

**ఆరోగ్య సేవల్లో 'సంజీవని' విప్లవం**

టెక్నాలజీని ఉపయోగించి పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో 'సంజీవని' ప్రాజెక్టును ప్రారంభించామని చంద్రబాబు తెలిపారు. "ఈ ప్రాజెక్టు ద్వారా ప్రజలందరి ఆరోగ్య రికార్డులను డిజిటలైజ్ చేస్తాం. ఇప్పటికే కుప్పంలో పైలట్ ప్రాజెక్టు పూర్తయింది. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా విస్తరించి దేశానికే ఆదర్శంగా నిలుస్తాం. 2026 నాటికి 72 లక్షల మంది రోగుల డేటాను సేకరించి, రియల్ టైమ్ మానిటరింగ్ చేస్తాం. త్వరలో ఎయిర్ అంబులెన్సులు, 2026 నాటికి డ్రోన్ అంబులెన్సులు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని వివరించారు.

**దాతృత్వానికి నిలువుటద్దం**

గుంటూరు మెడికల్ కాలేజీ పూర్వ విద్యార్థుల దాతృత్వాన్ని ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. 2.69 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 5 అంతస్తులుగా నిర్మించిన ఈ కేంద్రంలో మొత్తం 600 పడకలు ఉన్నాయి. కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ పెమ్మసాని చంద్రశేఖర్ రూ.80 కోట్ల వరకు విరాళాలు సేకరించడంలో కీలక పాత్ర పోషించారని తెలిపారు. డాక్టర్ గవిని ఉమాదేవి (రూ.22 కోట్లు), నళిని-వెంకట్ తేళ్ల (రూ.8 కోట్లు) సహా పలువురు దాతలు భారీగా విరాళాలు అందించారు. నాట్కో ఫార్మా కూడా వివిధ అవసరాల కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, పలువురు ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రాణాలు తీసేందుకే లడ్డూల్లో విష రసాయనాలు..
# వైసీపీ మహాపాపం చేసింది

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో ప్రాణాంతక రసాయనాలు కలిపారని, హిందువుల ప్రాణాలతో చెలగాటమాడేందుకు గత వైసీపీ ప్రభుత్వం పథకం ప్రకారమే ఈ కుట్రకు పాల్పడిందని టీటీడీ చైర్మన్ బొల్లినేని రాజగోపాల్ నాయుడు (బీఆర్ నాయుడు) సంచలన ఆరోపణలు చేశారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) దాఖలు చేసిన ఫైనల్ చార్జ్‌షీట్‌తో ఈ బండారం బట్టబయలైందని, ఇది స్లో పాయిజన్ ఇచ్చి హిందువులను హతమార్చే ప్రయత్నమేనని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కల్తీ నెయ్యితో లడ్డూలు తయారుచేసి మహాపాపానికి ఒడిగట్టిన వైఎస్ జగన్, వైసీపీ నేతలు హిందూ సమాజానికి తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సిట్ నివేదికలో తమకు క్లీన్‌చిట్ వచ్చిందని వైసీపీ నేతలు సిగ్గులేకుండా ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. వాస్తవానికి, 2019 నుంచి 2024 మధ్య కాలంలో టీటీడీకి సరఫరా అయిన సుమారు 60 లక్షల కిలోల నెయ్యి కల్తీ అని సిట్ చార్జ్‌షీట్‌లో స్పష్టంగా పేర్కొందని తెలిపారు. ఈ రూ.250 కోట్ల విలువైన కల్తీ నెయ్యితో సుమారు 20 కోట్ల లడ్డూలను తయారు చేసి భక్తులకు పంపిణీ చేశారని, కోట్ల మంది హిందువుల మనోభావాలను దారుణంగా దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరాఖండ్‌కు చెందిన బోలే బాబా ఆర్గానిక్ డెయిరీ అనే సంస్థకు కనీస పాల సేకరణ సామర్థ్యం లేకపోయినా, కేవలం ఒకరిద్దరికి లబ్ధి చేకూర్చేందుకే నిబంధనలు మార్చి కాంట్రాక్ట్ కట్టబెట్టారని ఆరోపించారు. "చుక్క పాలు లేకుండా లక్షల కిలోల నెయ్యి ఎలా వస్తుంది? పామాయిల్, ప్రాణాంతక రసాయనాలు, జంతు కొవ్వు (టాలో) కలిపి సింథటిక్ నెయ్యి తయారు చేసి శ్రీవారి ప్రసాదంలో వాడారు. ఎన్‌డీడీబీ (చీణణదీ) నివేదికతో పాటు సిట్ రిపోర్ట్‌లోనూ నెయ్యిలో జంతు కొవ్వు ఉన్నట్లు స్పష్టంగా ఉంది. ఇది హిందువులపై జరిగిన దాడి కాదా?" అని బీఆర్ నాయుడు ప్రశ్నించారు. ఈ కుట్ర వెనుక వైసీపీ పెద్దల హస్తం ఉందని, అన్యమతస్థులు తిరుమల ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నించగా, గత పాలకులు వారికి సహకరించారని ఆరోపించారు.ఈ కేసులో గత టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి దంపతులు తమ బ్యాంకు ఖాతాల వివరాలు సీబీఐకి ఇవ్వడానికి నిరాకరించారని, కానీ ఆయన పీఏ చిన్నప్ప ఖాతాలోకి కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని నిలదీశారు. గత పాలకుల ఒత్తిళ్లకు సంబంధించిన ఈ-మెయిళ్లు కూడా సిట్ వద్ద ఆధారాలుగా ఉన్నాయని చెప్పారు. తిరుమలలో జరిగిన ఈ అపచారానికి వైసీపీ నేతలు సమాధానం చెప్పాలని, తప్పులు చేసి ఇప్పుడు

యాగాలు చేస్తే పాపాలు పోవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కల్తీ నెయ్యిలోని రసాయనాలపై పూర్తి నిజాలు తేలేందుకు మైక్రో డీఎన్ఏ టెస్ట్ చేయించాలని సిట్‌ను, న్యాయస్థానాన్ని కోరతామని బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఈ మహా కుంభకోణం వెలుగులోకి వచ్చిందని, టీటీడీ పవిత్రతను కాపాడే విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని ఆయన తేల్చిచెప్పారు.

## ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

కువైట్ నుంచి ఢిల్లీకి బయలుదేరిన ఇండిగో విమానంలో బాంబు బెదిరింపు తీవ్ర కలకలం రేపింది. దీంతో విమానాన్ని అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానంలో 180 మంది ప్రయాణికులతో సహా మొత్తం 186 మంది ఉన్నారు. వారందరూ సురక్షితంగా ఉన్నారని అధికారులు తెలిపారు. విమానం గాల్లో ఉండగా, ఓ టిష్యూ పేపర్‌పై చేతిరాతతో ఉన్న బెదిరింపు సందేశాన్ని సిబ్బంది గుర్తించారు. విమానాన్ని హైజాక్ చేస్తామని, బాంబు ఉందని ఆ నోట్‌లో ఉండటంతో పైలట్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఏవియేషన్ భద్రతా నిబంధనల ప్రకారం, పైలట్ వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌ను సంప్రదించి, విమానాన్ని సమీపంలోని అహ్మదాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు.విమానం సురక్షితంగా ల్యాండ్ అయిన వెంటనే, భద్రతా ఏజెన్సీలు అప్రమత్తమయ్యాయి. ప్రయాణికులందరినీ కిందకు దించి సురక్షిత ప్రాంతానికి తరలించారు. అనంతరం బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, సీఐఎస్ఎఫ్, డాగ్ స్క్వాడ్ బృందాలు విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ఎయిర్‌పోర్ట్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.డి. నకుమ్ మాట్లాడుతూ, "తనిఖీల్లో ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదు. విమానం తనిఖీ పూర్తయింది, తదుపరి విచారణ కొనసాగుతోంది" అని వివరించారు.అధికారులు ఈ చేతిరాత నోట్ ఎక్కడి నుంచి వచ్చింది, విమానంలోకి ఎలా చేరింది అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. విమానం తిరిగి ఢిల్లీకి ఎప్పుడు బయలుదేరుతుందనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇటీవల అహ్మదాబాద్‌లో పలు చోట్ల బాంబు బెదిరింపులు రాగా, అవన్నీ వట్టివేనని తేలింది. అయినప్పటికీ, ప్రతి బెదిరింపును తీవ్రంగా పరిగణిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## తిరుమల లడ్డూ నెయ్యిలో జంతువుల కొవ్వు లేదు.. తేల్చిచెప్పిన సీబీఐ..

- మొదటి పేజీ తరువాయి

వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూ తయారీలో ఉపయోగించిన నెయ్యిలో.. జంతువుల కొవ్వు లేదని.. జంతువుల నుంచి తీసిన కల్తీ నెయ్యిని ఉపయోగించలేదని వెల్లడించింది సీబీఐ. జగన్ ప్రభుత్వం హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదంలో వాడిన నెయ్యిలో.. జంతువుల కొవ్వు ఉందని స్వయంగా సీఎం చంద్రబాబు మాట్లాడిన మాటల తర్వాత.. కేసులు నమోదయ్యాయి. సీబీఐ విచారణకు జగన్ డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సీబీఐ విచారణ చేసింది. విచారణ తర్వాత.. జగన్ ప్రభుత్వం హయాంలో తిరుమలలో తయారు చేసిన లడ్డూ ప్రసాదంలో ఎలాంటి జంతువుల కొవ్వు కలవలేదని.. కల్తీ జరగలేదని.. స్పష్టం చేస్తూ సీబీఐ రిపోర్ట్ ఇచ్చింది.

శుక్రవారం ( జనవరి 23 ) ఫైనల్ చార్జిషీట్ సమర్పించింది సీబీఐ సిట్. తిరుమల లడ్డు తయారీలో ఉపయోగించే నెయ్యిలో కూరగాయల నూనెలు, కృత్రిమ పాల ఉత్పత్తులలో వాడే ఈస్టర్‌లు కలిపి కల్తీ చేశారని చార్జిషీట్ లో పేర్కొంది సిట్. నెయ్యిలో జంతువుల కొవ్వు జాడ లేదని స్పష్టం చేసింది సిట్. సిట్ సమర్పించిన ఫైనల్ చార్జిషీట్ పై స్పందించిన టీటీడీ మాజీ చైర్మెన్ భూమన కరుణాకర్ రెడ్డి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లు ఉద్దేశపూర్వకంగా హిందూ మనోభావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు.జగన్ ను రాజకీయంగా దెబ్బతీయాలనే ఏకైక ఉద్దేశంతోనే తిరుమల లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతు కొవ్వు వాడారని చంద్రబాబు, పవన్ కళ్యాణ్ తప్పుడు ఆరోపణలు చేశారని అన్నారు. నిరాధారమైన ఆరోపణలతో జగన్ ను కించపరచడమే కాకుండా.. కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వర స్వామివారి పవిత్రత, ప్రతిష్టను దెబ్బతీయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు.గత ఏడాదిన్నర కాలంగా.. ప్రపంచవ్యాప్తంగా 1.4 బిలియన్లకు పైగా హిందువులు ఈ తప్పుడు ప్రచారంతో తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని అన్నారు.ఉత్తరాఖండ్‌లోని భగవాన్‌పూర్‌లో ఉన్న ప్రధాన సరఫరాదారు భోలే

బాబా ఆర్గానిక్ డెయిరీ "వర్చువల్" తయారీ యూనిట్‌గా పనిచేస్తుందని ఛార్జిషీట్ లో వెల్లడించింది సిట్. 2019 నుండి 2024 వరకు భోలేబాబా డెయిరీ నెయ్యి తయారీ కోసం పాలు, వెన్నను తీసుకోలేదని, అయినప్పటికీ టీటీడీకి కనీసం 68వేల కిలోల నెయ్యిని సరఫరా చేసిందని పేర్కొంది సిట్.ఫైనల్ ఛార్జిషీట్‌లో 36 మందిని నిందితులుగా పేర్కొంది సిట్, ఇందులో తొమ్మిది మంది టిటిడి అధికారులు, ఐదుగురు డైరీకి సంబంధించిన వ్యక్తులు, తదితరులు ఉన్నారు.

## సిగాచి బాధితులకు పరిహారం.. ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం

- మొదటి పేజీ తరువాయి

జిల్లా పాశమైలారంలోని సిగాచి పరిశ్రమలో జరిగిన పేలుడు ఘటనలో 56 మంది దుర్మరణం చెందగా, 8 మంది ఆచూకీ లభ్యం కాలేదు. మరో 28 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ బాధితులకు పరిహారం అందించాలని, ఘటనపై సిట్ దర్యాప్తునకు ఆదేశించాలని కోరుతూ బాబురావు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈ పిటిషన్‌పై ఈరోజు విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం, ప్రభుత్వ తీరును తప్పుబట్టింది. "పరిహారం ఎంత ఇస్తామని చెప్పారు? ఎంత ఇస్తున్నారు? అసలు ఎప్పుడు ఇస్తారు?" అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.పరిహారం పంపిణీకి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని కంపెనీని, ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అలాగే ఈ కేసులో ఈపీఎఫ్ హైదరాబాద్ రీజినల్ కమిషనర్, ఈఎస్ఐ డైరెక్టర్, రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలిని సుమోటోగా ప్రతివాదులుగా చేర్చింది. కంపెనీ ప్రకటించిన పరిహారంతో పాటు చట్టప్రకారం అందాల్సిన ప్రయోజనాల వివరాలను సమర్పించాలని వారికి నోటీసులు జారీ చేసింది.

## కుటుంబాన్ని మధ్యలోకి లాగొద్దు.. ఎలాన్ మస్క్‌పై వినోద్ ఖోస్లా ఫైర్

భారత సంతతికి చెందిన బిలియనీర్ ఇన్వెస్టర్ వినోద్ ఖోస్లా, టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్‌ల మధ్య మాటల యుద్ధం మరోసారి ముదిరింది. జాతి వివక్షాపూరిత వ్యాఖ్యలు చేస్తూ, తనను తాను సమర్థించుకోవడానికి కుటుంబాన్ని మధ్యలోకి లాగడంపై ఖోస్లా తీవ్రంగా స్పందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా మస్క్‌కు చురకలు అంటించారు. "ప్రపంచ జనాభాలో శ్వేతజాతీయులు వేగంగా అంతరించిపోతున్న మైనారిటీ" అంటూ మస్క్ గతంలో చేసిన ఓ పోస్ట్‌తో ఈ వివాదం మొదలైంది. దీనిపై స్పందించిన ఖోస్లా.. మస్క్ జాతి వివక్షను ప్రోత్సహిస్తున్నారని, 'వైట్ అమెరికా గ్రేట్ ఎగైన్' (ఔూ+ూ)కు మద్దతిస్తున్నారని ఆరోపించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన మస్క్.. ఖోస్లాను 'గర్విష్ఠి', 'రిటార్డ్' అంటూ దూషించారు. తన భాగస్వామి శివాన్ జిలిస్ సగం భారతీయురాలని, వారి కుమారుడికి భారత సంతతికి చెందిన నోబెల్ బహుమతి గ్రహీత చంద్రశేఖర్ పేరు పెట్టానని చెబుతూ తనపై వచ్చిన ఆరోపణలను ఖండించే ప్రయత్నం చేశారు.ఈ నేపథ్యంలో గురువారం ఖోస్లా మరోసారి స్పందించారు. "మీ కుటుంబాన్ని ఇందులో కలపడానికి బదులు, మరోసారి జాతి వివక్షగా అనిపించే పోస్టులు పెట్టకుండా ప్రయత్నించండి. మీరు అమెరికాలో శ్వేతజాతి సమాజాన్ని స్థాపించడానికి ప్రయత్నించడం లేదని, 'వైట్ అమెరికా గ్రేట్ ఎగైన్'కు మద్దతుదారు కాదని అంగీకరిస్తే చాలామంది అభినందిస్తారు" అని ఖోస్లా పేర్కొన్నారు.మస్క్ ప్రస్తావించిన బీచ్ వివాదంపై కూడా ఖోస్లా స్పందించారు. తన కాలిఫోర్నియా ఆస్తి సమీపంలోని బీచ్‌కు వెళ్లేందుకు ప్రైవేట్ ప్రాపర్టీ గుండా ప్రవేశించాలంటే రుసుము చెల్లించాల్సిందేనని అన్ని కోర్టులు తీర్పు ఇచ్చాయని గుర్తుచేశారు. "ప్రైవేట్ ఆస్తి హక్కు అనే సూత్రాన్ని కాపాడటానికి నేను నిలబడటాన్ని మీరు అభినందించాలి. ఇది కాకపోతే మిగతాదంతా కమ్యూనిజమే" అని వ్యాఖ్యానించారు.

## ఏపీ- తెలంగాణ జల వివాదం.. ఢిల్లీలో ఉన్నతస్థాయి కమిటీ భేటీ

- మొదటి పేజీ తరువాయి

జనవరి 2 న ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది కేంద్రం. గోదావరి, కృష్ణాలో అందుబాటులో ఉన్న జలాలు నికర జలాలు, మిగులు జలాలు, ప్రాజెక్టులు సహా పల అంశాలపై వివాదాలను పరిష్కరించుకుని ఎలా ముందుకు వెళ్లాలని దానిపై ఈ సమావేశంలో చర్చిస్తున్నారు.

గతేడాది కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న జలవివాదాలు వాటిని చర్చించి సాంకేతికంగా పరిశీలించేందుకు ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుకు అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయించారు. అపెక్స్ కౌన్సిల్ నిర్ణయం మేరకే ఇవాళ భేటీ అయిన ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు అయ్యింది.

## విశాఖలో చంద్రబాబు కుటుంబం భూదోపిడీకి తెరలేపింది

- మొదటి పేజీ తరువాయి

వైసీపీ నేతలు, కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, కన్నబాబు తదితర నేతలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ... చంద్రబాబు, ఆయన కుటుంబం విశాఖలో భూదోపిడీకి తెరలేపిందని అన్నారు. అధికారం ఉందని భూదోపిడీ చేస్తే పేద కుటుంబాల తరపున తాము పోరాటం చేస్తామని హెచ్చరించారు. ప్రజా వ్యతిరేక పనులను తాము ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని అన్నారు. ప్రజల ఆస్తులను కాపాడటమే లక్ష్యంగా ఈ నిరసన కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు.

# బాధ్యతలు స్వీకరించిన నూతన జాయింట్ కలెక్టర్

**కలెక్టరేట్ ఒంగోలు,పెన్ పవర్ జనవరి 30**

ప్రకాశం జిల్లా నూతన జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి శుక్రవారం ఒంగోలు కలెక్టరేట్ లో తన ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ని మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందజేశారు.



పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# విద్యతోపాటు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలి

## - రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా.శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 30**

విద్యతోపాటు విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా.శ్రీ బాల వీరాంజనేయస్వామి స్వామి అన్నారు. శుక్రవారం ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీలో డీఎస్సీ ద్వారా నూతనంగా అంబేద్కర్ కురుకులాల్లో నియమితులైన టిజిటి, పిఈటీ లకు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ శిక్షణలో భాగంగా షార్ట్స్ స్వచ్ఛంద సంస్థ వారు , విద్యార్థుల వ్యక్తిగత శుభ్రతపై "డెటాల్ బానేగా స్వచ్ఛ ఇండియా "పై అవగాహన కల్పించడం సంతోషదాయకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని ఆయన చెప్పారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా వంద శాతం ఉత్తీర్ణత కచ్చితంగా సాధించేలా ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. విద్యార్థుల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం 14 కోట్లతో గురుకులాలు, సంక్షేమ వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు వంటవారికి శిక్షణ ఇస్తున్నామన్నారు. ఐఐటి, నీట్ ఎక్సెలెన్సీ సెంటర్లను 10 కి పెంచామని మంత్రి తెలిపారు. 2017 లో ఐఐటి, నీట్ లో శిక్షణ ఇవ్వటం ద్వారా ఎంబీబీఎస్ 20 మందికి ఎన్ఐటి,ఐఐటి లలో 37 మందికి సీట్లు వచ్చాయన్నారు. వారికి ముఖ్యమంత్రి ఒక్కొకరికి లక్ష రూపాయలు నగదు బహుమతి గా అందించారని మంత్రి తెలిపారు. విద్యార్థులకు విద్య తోపాటు శరీర ధారుఢ్యం కొరకు క్రీడలు,సృజనాత్మకతను పెంపొందించడానికి సైన్స్ ఫేర్ నిర్వహించామన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారు ఉన్నత స్థాయి కి చేరుకోవటానికి మీ వంతు సహకారం అందించాలన్నారు. మీరు కూడా సర్వీస్ రూల్స్ తెలుసుకోవాలన్నారు. మన గురుకులాల్లో వెల్త్ హెల్త్ ఆఫీసర్ ను నియమించామని పిల్లల ఆరోగ్యం పై పూర్తి స్థాయిలో జాగ్రత్త తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు.మెనూ తప్పక పాటించాలని ఆయన ఆదేశించారు.కొద్దిలో నీట్ సీట్ మిస్ అయిన విద్యార్థులకి విజయవాడ లో 65 మంది కి ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. సింగరాయకొండ గురుకులలో 2 కోట్ల 25 లక్షల రూపాయలతో ఇండోర్ స్టేడియం నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కేసరి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఈ.వి. మూర్తి, గురుకుల జాయింట్ సెక్రటరీ రూపవతి, డి సి ఓ జయ, నెల్లూరు డిసిఓ ప్రభావతి, డీడీ సోషల్ వెల్ఫేర్ లక్ష్మా నాయక్, డి ఎం హెచ్ఓ టి.వెంకటేశ్వర్లు, తదితర అధికారులు పాల్గొన్నారు.

# మంత్రుల పర్యటన ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే ఇంటూరి

**కందుకూరు పెన్ పవర్ జనవరి 30**





పట్టణంలో శనివారం ఇద్దరు మంత్రులు పర్యటిస్తున్న నేపథ్యంలో అందుకు సంబంధించిన ఏర్పాట్లను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మియావాకి ప్రాజెక్టును మంత్రులు ప్రారంభించనున్నారు. ఒకేసారి వందల మంది విద్యార్థులతో మొక్కలు నాటిస్తారు. కాగా ఆ ప్రాంతాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే నాగేశ్వరరావు, మొక్కలను చూసి వివరాలు తెలుసుకున్నారు. స్కంధపురి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటుంది. సేవా సమితి చైర్మన్ పువ్వాడి మౌనిక, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ రవికుమార్, సిబ్బందితో ఎమ్మెల్యే మాట్లాడారు. ముందుగా టిడ్కో కాలనీ వద్ద సిసి రోడ్డు శంకుస్థాపన, తర్వాత ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. చివరిగా టిఆర్ఆర్ కాలేజీలో కార్యక్రమం జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా అన్ని ఏర్పాట్లు చేయాలని స్థానిక పోలీసులు, అధికారులకు ఎమ్మెల్యే నాగేశ్వరరావు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, ప్రకాశం జిల్లా డైరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, నార్నే రోశయ్య ,చదలవాడ కొండయ్య, పువ్వాడి కోటయ్య, రాయపాటి శ్రీనివాసరావు, పొడపాటి మాధవ, భవనాసి వెంకటేశ్వర్లు, గుమ్మా శివ, మచ్చ మనోహర్ ఇతర నాయకులు పాల్గొన్నారు.

# ఎడ్లూరుపాడు బడేవారిపాలెం రోడ్డుకు సొంత నిధులతో మరమ్మత్తులు



**కందుకూరు పెన్ పవర్, జనవరి 30**

ఎడ్లూరుపాడు గ్రామం నుంచి బడేవారిపాలెం వెళ్లే రోడ్డు మోకాళ్లోతు గుంతలతో ముళ్ళ చెట్లతో ఇరుకుగా తయారయ్యి ప్రయాణానికి చాలా ఇబ్బందికరంగా ఉండటం గమనించిన ఉండవల్లి రాములు వల్లూరి వారి యొక్క సొంత ఖర్చులతో, మన రైతన్న ఫౌండేషన్ టీమ్ సహకారంతో రోడ్డు మరమ్మత్తులు చేయించారు. సదరు రోడ్డుపైన ప్రతినిత్యం కొన్ని వందల మంది ప్రయాణం చేస్తూ ఉంటారు అంతేకాకుండా పదుల సంఖ్యలో ట్రాక్టర్లు వెళుతూ ఉంటాయి. ముఖ్యంగా శని ఆదివారాల సమయంలో మాలకొండ, మొగిలిచర్ల వెళ్లడానికి ఎంతో ఉపయోగకరమైన రోడ్డు, దానితోపాటుగా రైతులకు, అంతేకాకుండా బడేవారిపాలెం పోకూరు వెళ్ళడానికి అలాగే బడే వారి పాలెం మీదగా వెళ్లే హైవే కనెక్టివిటీ కానీ ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరమైనది ఈ రోడ్డు పూర్తిగా గుంతలమయం కంప చెట్లు పెరిగి రోడ్డు చాలా వరకు కుంచించుకు పోయిన కారణం చేత రాత్రి సమయాల్లో ప్రయాణానికి చాలా ఇబ్బందికరంగా ఉంది. ఈ గుంతలు మొత్తం జెసిబి సహాయంతో పూడ్చివేయడం జరిగినది అవసరమైనచోట్ల ఇతర ప్రాంతాల నుంచి మట్టి తెచ్చి గుంతలు పూడ్చి వేయించారు. రోడ్డు వెడల్పు చేయడం, కంప చెట్లు మొత్తం వేళ్ళతో సహా పీకి వేసి రోడ్డు విశాలంగా చేయడం జరిగింది. గుంతలు పూడ్చడం ముళ్ళ చెట్లు తీసీ వేయడం వలన ఎడ్లూరుపాడు గ్రామం తో పాటు బడేవారిపాలెం, పోకూరు వెళ్లే ప్రజలు ఈ కార్యక్రమాన్ని ఎంతో మెచ్చుకొని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరిని మనస్ఫూర్తిగా అభినందించారు. మన రైతన్న ఫౌండేషన్ సభ్యులు బాశం కోటేశ్వరరావు, పొన్నగంటి సురేష్, నరేష్ ముండ్లమూరి శ్రీహరి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి

## - జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి







**కలెక్టరేట్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 30**

జిల్లాలో క్షేత్ర స్థాయిలో నెలకొని ఉన్న భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి పేర్కొన్నారు. ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టరుగా శుక్రవారం ఉదయం ఆమె బాధ్యతలు చేపట్టారు. తొలుత జిల్లా రెవెన్యూ అధికారి బి. చిన ఓబులేసు, ఒంగోలు ఆర్డిఓ లక్ష్మీ ప్రసన్న, ఇతర రెవెన్యూ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, హిందూ, ముస్లిం, క్రైస్తవ మత పెద్దల ఆశీర్వచనాల మధ్య జిల్లా జాయింట్ గా కల్పనా కుమారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, మీడియా తో మాట్లాడుతూ, జాయింట్ కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించడం జరిగిందని, ప్రకాశం జిల్లాకు జాయింట్ కలెక్టర్ గా రావడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాలో క్షేత్ర స్థాయిలో నెలకొని ఉన్న భూ సమస్యలు, రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు పురోగతిపై ప్రత్యేక శ్రద్ద చూపడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాల అమలులో ఏవైనా సమస్యలు వుంటే సంబంధిత శాఖల అధికారులు స్వయంగా నా దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యల పరిష్కారం పై దృష్టి సారించడం జరుగుతుందని వివరించారు. అనంతరం పలువురు జిల్లాస్థాయి అధికారులు, ఉద్యోగులు జాయింట్ కలెక్టర్ ను కలిసి పుష్పగుచ్చాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

# ఏపి జెన్కోలో కారుణ్య నియామకాల కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 30**

ఏపీ జెన్కో పరిధిలో 27 మంది బాధిత కుటుంబ సభ్యులకు కారుణ్య నియామక పత్రాలు అందజేసిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగింది. ఈకార్యక్రమంలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని నియామక పత్రాలను పంపిణీ చేశారు. విద్యార్హతలకు అనుగుణంగా ఉద్యోగాలు కల్పిస్తూ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం భరోసా ఇస్తోందని. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్కరికి కూడా ఇంజనీరింగ్ స్థాయి ఉద్యోగాలు ఇవ్వకపోగా, ఉన్నత విద్యార్హత ఉన్నవారిని కూడా తగని ఉద్యోగాలతో సరిపెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జూనియర్ ఇంజనీర్ స్థాయి ఉద్యోగాలు కూడా ఇస్తూ న్యాయం చేస్తోందని ఈసందర్భంగా అశోకరెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో ఏజ్ రిలాక్సేషన్ కల్పించి, ప్రతి మూడు నెలలకు ఒకసారి కారుణ్య నియామకాలు చేపడుతూ ఇప్పటివరకు 600 మందికి పైగా నియామక పత్రాలు అందించారని తెలిపారు.

# మహాత్మా గాంధీ జీవితం ఆదర్శప్రాయం

## జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు - గాంధీజీకి ఎమ్మెల్యే దామచర్ల, ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే విజయ్ కుమార్ నివాళులు



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 30**

శాంతి, అహింసా మార్గంలో పోరాడి దేశానికి స్వాతంత్ర్యాన్ని అందించిన మహోన్నత వ్యక్తి జాతిపిత మహాత్మా గాంధీ జీవితం అందరికీ ఆదర్శపాయమని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఒంగోలు గాంధీ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల. జనార్ధన రావు, సంతనూతలపాడు శాసనసభ్యులు బి.ఎన్.విజయ్ కుమార్, ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ షేక్.రియాజ్, డి.ఆర్. ఓ. బి. చిన ఓబులేసులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మహాత్ముని పోరాట స్ఫూర్తి, గాంధేయ విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఒంగోలు కలెక్టరేట్ లోని విసి హాల్లో మహాత్మా గాంధీ చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు తో కలసి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



# మహాత్ముని ఆశయాలు ప్రతి ఒక్కరికి స్ఫూర్తి




**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 30**

జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాలు ప్రతి ఒక్కరికి ఎంతో స్ఫూర్తి అని పిఎంశ్రీ జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కలవ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని వాసవి వీకేఎస్పీ, వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ నేతృత్వంలో పాఠశాలలోని మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని రెవెన్యూ ప్రాంగణంలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్, వాసవి వికేఎస్పి, వాసవి వనిత క్లబ్ నాయకులు వెలుగూరి చంద్ర, రాచపూటి వెంకటేశ్వర్లు, రాచర్ల నరేష్, పైడిమర్రి సుబ్బయ్య, వనమా వెంకటేశ్వర్లు, పాలువాది జయరాం, కనుమర్లపూడి లక్ష్మీ మోహన్, మునగ శివ, కందుకూరి మహాలక్ష్మి తదితరులు మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

# జాతిపిత మహాత్మా గాంధీ కి ఘనంగా నివాళులు అర్పించిన బైరెడ్డి, దారపనేని



**పామూరు, పెన్ పవర్ జనవరి 30.**

సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడి యావత్ భారత జాతికి స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు అందించిన జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి శుక్రవారం సందర్భంగా తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బైరెడ్డి జయరామిరెడ్డి జాతిపిత మహాత్మా గాంధీ, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బైరెడ్డి, దారపనేని మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమ నాయకుడు జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం జనవరి 30వ తేదీన అమరవీరుల దినోత్సవంగా దేశం నిర్వహిస్తుందని, శాంతి సత్యాగ్రహాల మార్గంలో గాంధీజీ బ్రిటిష్ వారిని ఎదిరించి ప్రజలను సంఘటితం చేసి స్వరాజ్యం సాధించడంలో కీలక పాత్ర పోషించారని, జాతిపిత గాంధీజీ అహింస సిద్ధాంతం దేశానికి స్వాతంత్రం తీసుకురావడమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఎందరో పోరాట యోధులకు స్ఫూర్తిదాయకమైందని పేర్కొన్నారు. దారపనేని రాజేంద్రప్రసాద్ జాతిపిత మహాత్మా గాంధీకి నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

# జాతి పితకు కు ఘన నివాళి అర్పించిన బీజేపీ నాయకులు

**గిద్దలూరు, పెన్ పవర్ జనవరి 30**

గిద్దలూరు పట్టణము లో భారతీయ జనతా పార్టీ నాయకులు అప్పిశెట్టి ఉదయ్ శంకర్ ఆధ్వర్యంలో జాతి పిత మహాత్మా గాంధీ 78 వ వర్ధంతి సందర్భంగా గిద్దలూరు పట్టణము లో ముండ్లపాడు బస్టాండ్ లో ఉన్న బాపూజీ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ కార్యక్రమం లో మాజీ జిల్లా ఉపాధ్యక్షులు భవనాశి వెంకట రామాంజనేయులు మాట్లాడుతూ శాంతి మార్గాన్ని ఎంచుకొని బాపూజీ దేశ స్వాతంత్రం సాధించారని . దేశానికి గాంధీ చూపిన అహింసా మార్గం నేటి యువతకు ఆదర్శం గా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు కె చంద్ర మోహన్,బాదుల్ల, రంగస్వామి దేవస్థానము బోర్డు మెంబెర్ కొప్పుల నరసింహులు, మునగ నూరి రామకృష్ణ, జనార్దన్, భూపని సంతోష్ కుమార్ పాల్గొన్నారు.



# వ్యవసాయం ద్వారా రైతులు వారి యొక్క జీవన ప్రమాణాలు మెరుగు పరుచుకోవాలి

**పెద్ద దోర్నాల పెన్ పవర్ జనవరి 30**

మండలం లోని చింతల క్లస్టర్ గ్రామం లో వ్యవసాయ శాఖ వారు వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం 2025 26 ఆర్కె వి ఐ వై- ఆర్ ఏ డి పథకం కింద రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రెగ్యులర్ ఎర్రగొండపాలెం ఈ. వెంకటరమణ పాల్గొని రైతులకు వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకం యొక్క విధి విధానాల గురించి అలాగే ఈ పథకంలో సమగ్ర సుస్థిర వ్యవసాయం ద్వారా రైతులు వారి యొక్క జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవడం కోసం రాష్ట్ర ప్రభుత్వము గిరిజన రైతులకు కుటుంబానికి 30 వేల రూపాయలు వరకు ఈ పథకం కింద రాయితీస్తుందని తెలిపారు అలాగే ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి డి జవహర్లాల్ నాయక్ మాట్లాడుతూ వర్షాధార ప్రాంత అభివృద్ధి పథకంలో వ్యవసాయ పంటలు లో భాగంగా పప్పు జాతి పంటలు, చిరుధాన్యాలు,పశుగ్రాసము, నూనె గింజ పంటలు, అలాగే ఉద్యాన పంటలు లేక పశువుల పెంపకం కోళ్ల పెంపకం మేకల పెంపకం గొర్రెల



పెంపకం ఈ మూడింటిలో రెండు పథకాలు పాటించిన రైతులకు అలాగే సేంద్రియ వ్యవసాయం కింద వర్మి కంపోస్ట్ యూనిట్స్ తేనెటీగల పెంపకం, సైలేజి,చేపల పెంపకం ఈ నాలుగింటిలో రెండు యాక్టివిటీస్ చేసిన రైతులకు ఒక రైతు కుటుంబానికి 30 వేల రూపాయలు రాయితీస్తుందని తెలిపారు కాబట్టి రైతులు తప్పనిసరిగా ఈ పథకాన్ని



ఉపయోగించుకొని వారి యొక్క జీవన ప్రమాణాలను మెరుగుపరచుకోవాల్సిందిగా అలాగే సుస్థిర వ్యవసాయంలో సంవత్సరం పొడవునా రైతులకు ఆదాయం కల్పించే విధంగా ఈ పథకం ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వి.పరిపూర్ణ గ్రామ రెవెన్యూ అధికారి వెంకటయ్య,ఎన్జీవో సిబ్బంది చింతల క్లస్టర్ పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

# అందరివాడు కృష్ణమూర్తి...

## టీడీపీ మాజీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్..



**పుల్లల చెరువు పెన్ పవర్ జనవరి 30**

దివంగత టీడీపీ సీనియర్ నాయకులు మేడికొండ కృష్ణమూర్తి 15వ వర్ధంతిని పుల్లల చెరువు బస్టాండ్ సెంటర్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ మాజీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కృష్ణమూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పయ్యావుల ప్రసాద్ మాట్లాడుతూ మేడికొండ కృష్ణమూర్తి అంటే ఒక వ్యక్తి కాదు... ఒక ఉద్యమం. ఆయన నిజంగా అందరివాడు అంటూ కొనియాడారు. టీడీపీ పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివని, గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఎలాంటి పదవులపై ఆశ లేకుండా నిస్వార్థంగా పార్టీ కోసం కష్టపడి పనిచేసి, ఆపదలో ఉన్న కార్యకర్తలకు తన వంతు సహాయాన్ని అందించిన నాయకుడు కృష్ణమూర్తి అని తెలిపారు. పూల సుబ్బయ్య ఆశీస్సులతో రాజకీయ రంగ ప్రవేశం చేసిన కృష్ణమూర్తి, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ పేదల పెన్నిధిగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన నాయకుడిగా ఆయన గుర్తుండిపోతారని అన్నారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేసిన ఆయన జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు మేడికొండ శశిబాబు, యూనిట్ ఇన్చార్జి సామ్రాట్, మేడికొండ లక్ష్మన్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఉప్పల హనుమంత్, గజ్జుల్లి భాస్కర్, మాజీ ఎంపీటీసీ ఇదేమ్మ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కృష్ణమూర్తి అభిమానులు పాల్గొన్నారు.

# గజల్ శ్రీనివాస్ కి నట సామ్రాట్ అక్కినేని 2026- అవార్డు 2026



**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు జనవరి 30**

గజల్ శ్రీనివాస్ గజల్ గానం ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. భార్య మీద పాడిన గజల్ ప్రేమ తత్వాన్ని తెలియజేయగా, అమ్మ, నాన్న మీద, మరణం పై పాడిన గజల్స్ ప్రేక్షకుల్ని కన్నీటి పర్యంతం చేసింది. మానవతా విలువలు, వ్యక్తిత్వ వికాసం, భాష సౌందర్యం కలగలిపి గజిల్స్ వినిపించారు. అక్కినేని కళాపరిషత్ ఆధ్వర్యంలో సివిఎన్ రీడింగ్ రూమ్ లో ఏర్పాటుచేసిన అక్కినేని వర్ధంతి వేడుకలలో ఆయన చేసిన గజల్ గానం ప్రేక్షకులని అలరించింది. ఈ సందర్భంగా గజల్ శ్రీనివాస్ కి నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అవార్డు 2026 ను ప్రదానం చేశారు.




ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, కాకతీయ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షులు మండవ మురళీకృష్ణ, నెక్స్ట్ జన్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ డాక్టర్ కె.మురళీధర్ రెడ్డి, ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదరీ నారాయణ పాల్గొని అవార్డు ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షులు కళ్లగుంట కృష్ణయ్య, ప్రకాశంజిల్లా రచయిత సంఘ అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, అక్కినేని కళాపరిషత్ గౌరవాధ్యక్షులు సిహెచ్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు కళ్లగుంట శ్రీనివాసరావు, తోట్టెంపూడి కృపారావు తదితరులు పాల్గొన్నారు.

# జాతిపిత మహాత్మా గాంధీ త్యాగాలు మరువ లేనివి

## దేశ స్వాతంత్ర సమపార్జునలో జాతిపిత కృషి మరువరానిది.

## కొమరోలు తాసిల్దార్ కార్యాలయంలో జాతిపిత వర్ధంతి కార్యక్రమాలు.

**కొమరోలు పెన్ పవర్ జనవరి 30**

ఆంగ్లేయుల శృంఖలాల నుంచి భారతదేశానికి విముక్తి కలిగించి స్వాతంత్రాన్ని సాధించడంలో జాతికిత మహాత్మా గాంధీ చేసిన త్యాగాలు, సేవలు ఎన్నటికీ మరువరానివని కొమరోలు తాసిల్దార్ దేవరశెట్టి భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం కొమరోలు లోని తాసిల్దార్ కార్యాలయంలో జాతిపిత వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మా గాంధీ చిత్రపటానికి తాసిల్దార్ భాగ్యలక్ష్మి ,డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ సందర్భంగా తాసిల్దార్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, దేశాన్ని ఆంగ్లేయుల నుంచి కాపాడి స్వతంత్ర భారతదేశంగా ఏర్పాటు చేయుటకు జాతిపిత మహాత్మా గాంధీ నాయకత్వంలో ఎందరో మహనీయులు ఎన్నో త్యాగాలు చేశారని పేర్కొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ అహింసాయుత పద్ధతిలో అనేక సత్యాగ్రహాలు చేసి ఆంగ్లేయులు భారతదేశం నుంచి వెళ్లిపోయేంతవరకు అలుపెరుగని పోరాటాలు, ఉద్యమాలు చేశారని ఆమె గుర్తు చేశారు. జాతిపిత మహాత్మా గాంధీ భౌతికంగా లేనప్పటికీ, ఆయన ఆశయాలు, త్యాగాలు, ఉద్యమ స్ఫూర్తి భారతీయుల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయి ఉన్నాయని పేర్కొన్నారు. ఆ కార్యక్రమంలో మండల సర్వేయర్ జమాల్, జూనియర్



అసిస్టెంట్లు పెద్దదేవ నాయక్, రంగనాయకులు ,శ్రీవిద్య, కంప్యూటర్ ఆపరేటర్ ఉషారాణి, ఎలక్షన్ డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజ్యలక్ష్మి, వీఆర్వోలు పాండు ,హనీషా, రమణారావు ,పివి రమణ, ఇండ్ల నారాయణ ,రాజేశ్వరి, వెంకటేశ్వర్లు, రంగనాయకులు, నాయబ్ రసూల్ ,రంగనాథ్ ,అంకయ్య ,వీఆర్ఏలు రాజేశ్వరి, హబీబా ,మరియ జ్యోతి, పోలమ్మ, భారతి ,ఆందోని, రమణ, వెంకటేశ్వర్లు తో పాటు పలువురు వీఆర్ఏలు తదితరులు జాతిపితి మహాత్మా గాంధీ చిత్రపటంపై పూల వర్షం కురిపించి ఘన నివాళులర్పించారు.

# వ్యాపార సంస్థల నామఫలకాలు తెలుగులో ఏర్పాటు చేయాలి

## - వ్యాపారస్థులకు గులాబీలు ఇచ్చి గజల్ శ్రీనివాస్ వినతి



**కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ జనవరి 30**

నగరంలోని వ్యాపార సంస్థల నామఫలకాలు తెలుగులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలని ఆంధ్ర సారస్వత పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు, ప్రముఖ గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ వ్యాపారస్తులను కోరారు. నగరంలోని ట్రంకు రోడ్ లో దుకాణాలకు ఆంగ్లంలో దుకాణం పేరు ఉండటంతో గమనించి వాటి క్రింద తెలుగులో కూడా దుకాణం పేరు ఉండేలా ముద్రించాలని దుకాణాల యజమానులను కోరారు. వారికి విజ్ఞాపన పత్రాన్ని అందించి గులాబీ పువ్వులు అందజేశారు. 10 రోజుల వ్యవధిలో తెలుగు పేరు ఉండే విధంగా చూడాలని కోరారు. మళ్లీ పది రోజులు అనంతరం అలానే ఉన్నట్లయితే వ్యాపారస్తుల పాదాలు కడిగి దుకాణం పేరు తెలుగులోకి మార్చే విధంగా వేడుకుంటామని అన్నారు. ట్రంక్ రోడ్డులోని పలు దుకాణాలను సందర్శించి వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి, ఆంధ్ర సారస్వత పరిషత్ జిల్లా శాఖ అధ్యక్షులు మూడమంచు వెంకటేశ్వర్లు, బొమ్మరాజు భాస్కరశర్మ తదితరులు పాల్గొన్నారు.

# మహాత్ముని ఆశయాలు సాధిస్తాం

## ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి.



**పామూరు, పెన్ పవర్, జనవరి 30**

మహాత్ముని జీవితం యావత్ ప్రపంచ మానవాళికి స్ఫూర్తి సందేశమని, మహాత్ముని ఆశయాలు సాధిస్తామని ఒంగోలు పార్లమెంటు టిడిపి అధ్యక్షులు, కనిగిరి శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ సత్యం, అహింసలనే ఆయుధాలుగా మలుచుకుని దేశానికి స్వాతంత్ర్యం సంపాదించిన మహనీయులు మహాత్మా గాంధీ అని ఆయన కొనియాడారు. సత్యం, అహింసలే ఆయుధాలైన జాతిపిత మహాత్ముని జీవితం ఆదర్శమన్నారు. సత్యాగ్రహంతో, సహాయ నిరాకరణతో, అహింసా మార్గంలో నడిచి భారతీయులకు బానిసత్వం నుంచి విముక్తి కలిగించారని ఆయన అన్నారు. మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ స్థాపనను సీఎం చంద్రబాబు సాకారం చేస్తున్నారని ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, ఎన్డీఏ కూటమి నేతలు, తదితరులు పాల్గొన్నారు.

# యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ప్రత్యేక డ్రైవ్

## అవసరమైన ధృవ పత్రములతో అందుబాటు ఉండాలి

## ఎంపిడిఓ సీతారామయ్య

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 30**

ఫిబ్రవరి నెలలో 2,3 , 4 తారీఖు లలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ను ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సదరు సర్వే నందు అన్ని శాఖల ఉద్యోగులు పాల్గొని సర్వే ను పూర్తి చేయాలని ఎంపిడిఓ కె సీతారామయ్య ఆదేశించారు, ఈ సర్వే విజయవంతం కొరకు ముందుగా పంచాయతీ అభివృద్ధి అధికారులు గ్రామాల్లో ముందుగా టామ్ టామ్ ద్వారా ప్రజలకు తెలియజేసి సదరు మూడు రోజులు అందుబాటులో అవసరమైన ధృవ పత్రములతో అందుబాటు లో ఉండేవిధంగా చూడాలని గిద్దలూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీ కే సీతా రామారావు కోరారు .

# గ్రామాలలో పారిశుద్ధం పరిశుభ్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలి

**కొమరోలు మండలంలో పర్యటించిన మార్కాపురం జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు**

**ప్రజలకు సచివాలయాల సిబ్బందికి పారిశుద్ధ కార్మికులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చిన డిపిఓ.**





**కొమరోలు పెన్ పవర్ జనవరి 30**

గ్రామాలలో పారిశుద్ధ్యం పరిశుభ్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు కొమరోలు మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో పర్యటించి ఆ గ్రామంలో అమలు జరుగుతున్న పారిశుధ్య పనులను, డంపింగ్ యార్డ్ పరిస్థితిని, పరిశీలించి, ఇంటి పన్నులు వసూలు ఏ మేరకు జరుగుతున్నాయో నల్లకుంట్ల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు అడిగి తెలుసుకున్నారు. ఆ సందర్భంగా ఆయన గ్రామంలో పర్యటించి ప్రజలకు పారిశుధ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. హరిత రాయబారులు తమ కేటాయించిన ప్రతి ఇంటిని ప్రతిరోజు తప్పనిసరిగా సందర్శించాలని, తడి, చెత్త పొడి చెత్త వేరువేరుగా సేకరించాలని, వన్ విన్ వన్మ్యా విధానం తప్పనిసరిగా పాటించాలని, బహిరంగ ప్రదేశాలలో ప్లాస్టిక్ వస్తువులను తగుల పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన వారిని కోరారు ..ఆ సందర్భంగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి తో మాట్లాడుతూ హరిత రాయబారులకు ప్రతినెల రెమ్యూనరేషన్ పెండింగ్ లేకుండా చెల్లించాలని, గ్రామంలో ఎక్కడ చెత్త దిబ్బలు ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సైడు కాలువలను తరచుగా శుభ్రం చేయాలని కోరారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడుతూ, ప్రతి ఫీలింగ్ పాయింట్ వద్ద క్లోరినేషన్ పద్ధతిగా చేయాలని, తాగునీటి నాణ్యతను పరీక్షించేందుకు వాటర్ టెస్టింగ్ నిరంతరం నిర్వహించాలని ,వాలువుల వద్ద నీటిని శుభ్రం చేసి బ్లీచింగ్తో శుభ్రపరచాలని సూచించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు ఎంపీడీవో చెన్నారావు ,గ్రామ సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేదే లేదు

**జిల్లా కలెక్టర్ రాజాబాబు**





**పొదిలి, పెన్ పవర్, జనవరి 30**

విధి నిర్వహణలో వైద్యులు నిర్లక్ష్యం వహిస్తే, ఊరుకునేదే లేదని జిల్లా కలెక్టర్ పి రాజబాబు హెచ్చరించారు. శుక్రవారం నాడు కలెక్టర్ రాజాబాబు స్థానిక ప్రభుత్వ వైద్యశాలను ఆకస్మిక తనిఖీ జరిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులు తప్పకుండా రోగులకు అందాలని ఆయన స్పష్టం చేశారు. పొదిలి ప్రభుత్వ ఆసుపత్రి పనితీరు పట్ల ఆయన అసహనం వ్యక్తం చేయడంతోపాటు వైద్యులను సిబ్బందిని హెచ్చరించారు. ఆసుపత్రి నిర్వహణ పట్ల ఫిర్యాదులు వస్తున్నాయని, వైద్యులు తమ పనితీరు మార్చుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ రాజా బాబు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు వెంట మండల తహసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డి, మునిసిపల్ కమిషనర్ ఏ మారుతి రావు తదితరులు కూడా ఉన్నారు.

# పొదిలిలో ఘనంగా మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు





**పొదిలి, పెన్ పవర్, జనవరి 30**

పొదిలిలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శనివారం నాడు గాంధీజీ వర్ధంతి వేడుకలను ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయంలో కమిషనర్ మారుతి రావు మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అలాగే పొదిలి నగర పంచాయతీ పరిధిలోని ఒకటవ సచివాలయంలో మహాత్మా గాంధీ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పొదిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ సోమి శెట్టి శ్రీదేవి, పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ ముని శ్రీనివాసులు, యూపీ హెచ్ సి హెచ్ వి మెరీనా, ఏఎన్ఎంలు విజయ, రాణి, ఎం ఎల్ హెచ్ పి సుప్రజ, సచివాలయ సిబ్బంది, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ విధుల నిర్వహణకు డైరీ ఎంతో ఉపయోగకరం

**- ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు**

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 30**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, ఆవిష్కరించిన రాష్ట్ర పోలీస్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ--2026.. పోలీస్ సంక్షేమ సమాచార దీపికను శుక్రవారం జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాలయంలో ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, పోలీస్ అధికారులు, సిబ్బందికి అందజేశారు. ఈ డైరీలో పోలీస్ అధికారులు, సిబ్బందికి నిత్య విధుల నిర్వహణలో అవసరమయ్యే అన్ని రకాల కీలక సమాచారం పొందుపరచడంపై జిల్లా ఎస్పీ హర్షం వ్యక్తం చేశారు. ఇది విధుల్లో ఉన్న పోలీసులకు ఎంతో ఉపయోగకరంగా ఉండడంతో పాటు వారి పనితీరును మరింత సమర్థవంతంగా చేయడంలో దోహదపడుతుందన్నారు. అలాగే పోలీస్ సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రూపొందించిన సమాచార దీపిక సిబ్బందికి అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది ఈ డైరీలోని సమాచారాన్ని సమర్ధంగా వినియోగించుకుని తమ విధులను క్రమశిక్షణతో, నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సింగరాయకొండ సీఐ



సి. హెచ్. హాజరత్తయ్య (రాష్ట్ర జనరల్ సెక్రటరీ), ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, పీసీఆర్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, ఐటి కోర్ సీఐ వెంకటేశ్వరరావు, ఆర్ఐ రమణ రెడ్డి, ఆర్ ఎస్సై తిరుపతిస్వామి(రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్), ఎస్పీ సీసీ నారాయణ, ఏ.ఎస్సై మహబూబ్ బాషా, హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# జాతిపిత మహాత్మా గాంధీ నివాళులు అర్పించిన వైసిపి నాయకులు



**పామూరు, పెన్ పవర్, జనవరి 30.**

జాతిపిత మహాత్మా గాంధీ 78 వ వర్ధంతి సందర్భంగా పామూరు పట్టణంలోని వైఎస్ఆర్సిపి కార్యాలయంలో వైసిపి నాయకులు జాతిపీత మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులుఅర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత జాతిపిత మహాత్మాగాంధీ 1869 అక్టోబర్ 2న గుజరాత్లోని పోర్బందర్లో జన్మించారు. అహింసను ఆయుధంగా చేసుకుని బ్రిటిష్ వారితో పోరాడి, దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొచ్చిన మహనీయుడు గాంధీ అని వారు అన్నారు. అహింస మార్గంలో ఉద్యమించి బానిస సంకెళ్ల నుంచి దేశాన్ని విముక్తి కల్పించారని వారు అన్నారు. సత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప వ్యక్తి మహాత్మా గాంధీ. వారి ఆదర్శాలను అనుసరిస్తూ సమాజంలో అహింస, సమానత్వానికి ప్రాచుర్యం కల్పిద్దాం దేశం అభివృద్ధి చెందడం అంటే అద్దాల మేడలు, రంగుల గోడలు కాదు, పౌరుల నైతికాభివృద్ధే నిజమైన దేశాభివృద్ధి అని చెప్పిన వ్యక్తి గాంధి అని వారు కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో కీలక పాత్ర పోషించిన గొప్ప మహనీయుడు జాతిపిత మహాత్మాగాంధీ అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరి రామిరెడ్డి, గట్ల విజయ భాస్కర్ రెడ్డి, కందుల శ్రీనివాసులు రెడ్డి, కో ఆప్షన్ నాయాబ్ రసూల్, యాట రాఘవేంద్ర, తుపాకుల ఆంజనేయులు, కందుల శివ రామిరెడ్డి, షేక్ నాగూర్ బాషా, బద్రిస్వామి రంగారెడ్డి, ముడియాల అనంత రెడ్డి, షేక్ రసూల్ , సుత్తినేని రమణయ్య, షేక్ రసూల్, వేముల గురుస్వామి, సిదనబోయిన గిరిబాబు, షేక్ రసూల్, యాటా వీరాస్వామి, నిరుకట్టు శ్రీనివాసులు, అబ్బారెడ్డి వెంకట రత్నం, చింతంరెడ్డి బాలి రెడ్డి, దుగ్గిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, బడాబగ్ని రాజు, వేగళం బాలబ్రహ్మం, పటాన్ రసూల్ ఖాన్, ఈర్ల కోటేశ్వరరావు, గాలంకి బాల కేశవ్వులు, కోడూరి లక్ష్మి నారాయణ, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొని నివాళులుఅర్పించారు.

# శ్రీ లక్ష్మి తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల కళ్యాణ మహోత్సవ కార్యక్రమం



**దొనకొండ జనవరి 30 పెన్ పవర్**

మండలంలోని గంగదేవిపల్లి గ్రామంలో కాటంరాజు చెట్టు దగ్గర వెలసి ఉన్నటువంటి లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం1-02-2026 నాడు జరుగును అదేవిధంగా సాయంత్రం 9.5 నిమిషములకు కళ్యాణము జరుగును. సాయంత్రం 8 గంటలనుండి 12 గంటల వరకు భోజనాల కార్యక్రమం జరుగును. ఆలయ పూజారి వేల్పుల తిరుపతమ్మ తెలియజేశారు.

# ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి...



**పుల్లల చెరువు పెన్ పవర్ జనవరి 30**

రాష్ట్ర ప్రభుత్వ మేనిఫెస్టోలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ఎస్ టీయు ఆధ్వర్యంలో పుల్లలచెరువు మండల తహసిల్దార్కు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారని తెలిపారు.వెంటనే 18వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని, పెండింగ్ బకాయిలు, నాలుగు డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, అర్హులైన ఉద్యోగులకు ప్రూూ వర్తింపజేయాలని కోరారు.ఈ వినతిపత్రాన్ని సంబంధిత ఉన్నతాధికారులు, ప్రభుత్వానికి పంపించి న్యాయం చేయాలని తహసిల్దార్ను విజ్ఞప్తి చేశారు.

# ఉపాధి హామీని యధావిధిగా కొనసాగించాలి

**– ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం –డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఆర్. వెంకట్రావు**

**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు జనవరి 30**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని పేరు మార్చి పథకానికి తూట్లు పొడుస్తున్నారని నిరసిస్తూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సామూహిక నిరసన దీక్ష కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు సయ్యద్ మౌలాలి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఆర్ వెంకట్రావు మాట్లాడుతూ దేశంలోని నిరుపేదలకు వలసలు నివారణ, గ్రామీణ పేదల ఆర్థిక భరోసా కల్పించిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణఉపాధి హామీ పథకానికి మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని అన్నారు. ఈ పథకం వల్ల పేద ప్రజల ఆర్థిక పరిస్థితి మెరుగుపడి బ్యాంకు మెట్లు ఎక్కగలుగుతున్నారని రిజర్వ్ బ్యాంకు కితాబు ఇచ్చింది అన్నారు. ఈ పథకానికి 'వి బి జీ రాంజీ' అనే పేరు మార్చి గ్రామీణ పేదల ఆర్థిక పరిస్థితి పై దెబ్బ కొట్టే ప్రయత్నం కేంద్ర ప్రభుత్వం




చేస్తుందని ఈ పనిని తక్షణం మానుకొని పాత చట్టం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధాతధంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు జీపీ రామారావు, గద్దల రవి, సిపిఐ ఒంగోలు నగర కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్లూరి మురళీ, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి ఎం. విజయ, తిరుపాలు గుజ్జులబాలిరెడ్డి, వై. పుల్లమ్మ, రాగాల అంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# నేటి యువత గాంధీ మార్గాన్ని అలవర్చుకోవాలి –గురునాధం...



**పుల్లల చెరువు పెన్ పవర్ జనవరి 30**

పుల్లల చెరువు మండల కేంద్రంలో మహాత్మా గాంధీ వర్ధంతిని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం గాంధీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను స్మరించుకున్నారు.కార్యక్రమం ప్రారంభం నుంచే భక్తి, గౌరవ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపవరపు గురునాధం మాట్లాడుతూ సత్యం, అహింస అనే మార్గాలతో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచిన మహనీయుడు మహాత్మా గాంధీ అని అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించడమే కాకుండా, సమాజాన్ని నైతిక విలువల వైపు నడిపించిన గొప్ప నాయకుడిగా గాంధీ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. అనంతరం ఏఎంసీ మాజీ డైరెక్టర్ ఉప్పల హనుమంతు మాట్లాడుతూ నేటి కాలంలో హింస, అసహనం పెరుగుతున్న నేపథ్యంలో గాంధీ సిద్ధాంతాలు మరింత ప్రాసంగికమయ్యాయని తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి మాజీ మండల కన్వీనర్ పయ్యావుల ప్రసాద్ మాట్లాడుతూ గాంధీ ఆశయాలైన సమానత్వం, సామాజిక న్యాయం, మతసామరస్యం ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని భాస్కర్ పిలుపునిచ్చారు.ముఖ్యంగా యువత గాంధీ బోధించిన విలువలను తమ జీవితాల్లో పాటిస్తూ, దేశాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వాన్ని కాపాడుకోవడమే గాంధీకి ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.ఆర్యవైశ్య సంఘం ఎప్పటికప్పుడు సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ, విద్య, ఆరోగ్యం, పేదల సంక్షేమం కోసం కృషి చేస్తోందని ఈ సందర్భంగా తెలిపారు. గాంధీ ఆశయాలకు అనుగుణంగా భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# త్రాగునీటీ సమస్య పరిష్కారానికి ఏ ఏసీ సి గ్రాంట్ క్రింద కోటి రూపాయల మంజూరు

**తక్షణమే ఏ ఎస్ సి గ్రాంట్ ద్వారా నిధులు మంజూరు చేసిన మంత్రి నారాయణ –ఎమ్మెల్యే ముత్తుముల**

**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 30**

గిద్దలూరులో వేసవిలో నీటి సమస్యను అధిగమించేందుకు మున్సిపల్ శాఖ మంత్రి తక్షణ సహాయంగా కోటి రుపాయలు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ను గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్బంగా గిద్దలూరు మున్సిపాలిటీలోని పలు సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. రానున్న వేసవిలో పట్టణ ప్రజల త్రాగునీటి సమస్యను పరిష్కారం చేసేందుకు, ముందస్తు చర్యలు చేపట్టెందుకు నిధులు మంజూరు చేయాలని మంత్రికి విన్నవించారు. తక్షణమే స్పందించిన మంత్రి నారాయణ ఏ ఎస్ సి గ్రాంట్ ద్వారా తక్షణ సహాయంగా రూ. కోటి రూపాయలు నిధులు మంజూరు చేశారు. త్రాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే అశోక్ రెడ్డి తెలిపారు.

# జాతిపితకు నివాళులు అర్పించిన గిద్దలూరు తెలుగుదేశం నాయకులు




**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 30**

జాతిపిత మహాత్మా గాంధీజీ వర్ధంతి సందర్భంగా గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఆదేశాల మేరకు గిద్దలూరు పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు గాంధీజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం కోసం భారత రాజ్యాంగం పంచాయితీ వ్యవస్థను రూపొందించిందని, సత్యం, అహింస, త్యాగాలతో భారతదేశ స్వాతంత్ర్యానికి నాయకత్వం వహించిన మహనీయుడు, ప్రపంచానికి శాంతి సందేశం ప్రబోధించిన జాతిపిత మహాత్మా గాంధీ అని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి గాంధీజీ ఆశయాలను పంచాయితీలలో అమలు చేస్తూ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తుందని, గిద్దలూరు నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రజా పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు పట్టణ అధ్యక్షుడు సయ్యద్ శానేశావలి , సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాల ఈశ్వరయ్య , 11 వ వార్డు కౌన్సిలర్ లోక్కు రమేష్ , పట్టణ ఉపాధ్యక్షులు పందీటి రజిని బాబు , టీడీపీ సీనియర్ నాయకులు గుంటక కొండయ్య , పార్లమెంట్ నాయకులు గుర్రం డానియేలు , బోయిలపల్లి కిషోర్ , ఓబిలిబోయిన వెంకటయ్య, తిరుమలరెడ్డి, మోడిగారి క్రిష్ణ , ఎలిశెట్టి వెంకటప్ప , సురేష్ (బిల్డర్) , గులాం గోవింద్ , మహబూబ్ బాషా(ఎ) , చిలకల రమణ , సంపత్ కుమార్ రెడ్డి , గిద్దలూరు మద్దిలేటి , బద్రి బాషా , దూదేకుల దస్తగిరి , గర్రె సాయినాథ్ , నర్సింహా మూర్తి , సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు -ఏవో షేక్ మహమ్మద్



**పెన్ పవర్, కంభం జనవరి 30:**

రైతులకు అవసరపడును వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొనడం జరుగుతుందని ఏవో షేక్ మహమ్మద్ తెలిపారు. కంభం పట్టణంలో రైతులకు యూరియాను పంపిణీ చేసిన మండల వ్యవసాయ అధికారి షేక్ మహమ్మద్. కంభం మండలం లో రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉందని.రైతు సేవా కేంద్రాల్లో 30 టన్నులు ఎరుల షాపుల్లో 60 టన్నులు యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎరువులు షాపులను తనిఖీ చేసి అక్కడే ఉన్న రైతులకు యూరియా ప్రభుత్వం వారు నిర్దేశించిన ధరలకే పంపిణీ చేశారు. ఎరువుల దుకాణదారులందరూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మాలని, ఎక్కువ ధరలకు అమ్మితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట అగ్రికల్చర్ అసిస్టెంట్ రైతులు ఉన్నారు.

## మహాత్మా గాంధీ ఆశయాలు కొనసాగిద్దాం

**టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు**



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జనవరి 30**

దేశ జాతిపిత మహాత్మాగాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సేవా మార్గంలో అందరు పయనించాలని, ఆయన ఆశయాలను కొనసాగించాలని టీడీపీ నియోజకవర్గం ఇంచార్జి గూడూరి ఎరీక్షన్ బాబు అన్నారు.శుక్రవారం మహాత్మాగాంధీ 78వ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో అహింస అనే ఆయుధంతో భారతీయులందరిని ఏక త్రాటిపైకి తెచ్చి, బ్రిటిష్ ముష్కరుల మెడలు వంచాడని అన్నారు.మహిళ సాధికారత, గ్రామ స్వరాజ్యం,పేదరిక నిర్మూలన, వంటి గాంధీజీ ఆశయాలను కూటమి ప్రభుత్వం నెరవేర్చేందుకు అత్యంత కృషి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పెరుమాళ్ళ మల్లికార్జున, మండల అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డి, నాయకులు చేకూరి సుబ్బారావు, కొత్తమాసు సుబ్రహ్మణ్యం, తోట మహేష్ నాయుడు,గోళ్ళ సుబ్బారావు, అనుమాలశెట్టి సుబ్బారావు, ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ ఇస్మాయిల్, చిదేళ్ల నాగేశ్వరావు రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ విగ్రహం వద్ద సీపీఎం, ఉపాధి కూలీలు ప్రతిజ్ఞ

**పాత చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్**



**గుడ్లూరు, పెన్ పవర్, జనవరి 30:**

సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కొరకు, గాంధీ వర్ధంతి రోజు ప్రతిజ్ఞ చేయాలని అనే పిలుపును గుడ్లూరు గాంధీ విగ్రహం దగ్గర సిపిఎం కార్యకర్తలు, ఉపాధి కూలీలు ప్రతిజ్ఞ చేశారు. ఉపాధి హామీ చట్టాన్ని పాత పద్ధతిలో మహాత్మా గాంధీ పేరుతో ఉన్న చట్టాన్ని కొనసాగించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వీబీజీ రాంజీ పథకాన్ని రద్దు చేయాలని నిలదించారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి, కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడడానికి, ఈ చట్టానికి సవరణలు తెచ్చిందని సిపిఎం గుడ్లూరు ప్రాంతీయ కమిటీ కన్వీనర్ జి.వెంకటేశ్వర్లు అన్నారు. కూలీల కడుపు కొట్టి, కార్పొరేట్ల బొజ్జలు నింపటానికే ఈ పథకం అని ఆయన అన్నారు. ఈ పథకం కాపాడుకోవడానికి ఉపాధి కూలీలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని, ఫిబ్రవరి2వ తేదీన అన్ని సచివాలయాల్లో అర్జీలు ఇస్తామని, 5వ తేదీన గుడ్లూరు మండల కార్యాలయశీలో ధర్నా చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గుడ్లూరు ప్రాంతీయ కమిటీ కన్వీనర్ జి వెంకటేశ్వర్లు, సీపీఎం శాఖ కార్యదర్శులు, కొట్టే వెంకయ్య, గుత్తి మల్లికార్జున, రైతు నాయకులు దామా కృష్ణయ్య , వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.సుభాన్, ఐద్వా జిల్లా నాయకులు సుంకర విజయలక్ష్మి, సిపిఎం సీనియర్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, వీ.కొండయ్య, ఆర్.శ్రీనివాసరెడ్డి, డీ.బాలకోటయ్య, పి.మరియమ్మ, సీహెచ్.రాజగోపాల్, లక్ష్మీ, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు, ఎస్.డీ. సుభాని తదితరులు పాల్గొన్నారు.

# మహాత్మాగాంధీ మార్గం అనుసరణీయం - గాంధీజీ 77వ వర్ధంతి పలు సంఘాల నివాళులు











**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు జనవరి 30**

నా జీవితమే నా సందేశం అని చాటి ఎంతో నిరాడంబరమైన జీవితాన్ని గడిపి అహింసా మార్గంలో నడిపి భారత స్వాతంత్ర్య పోరులో ఒక మహోన్నతమైన అధ్యాయాన్ని లిఖించిన మహనీయుడు మోహన్ దాస్ కరంచంద్ గాంధీ అని వక్తలు పేర్కొన్నారు. 1948 జనవరి 30వ తేదీన గాడ్సే తూటాలకు బలై తనువు చాలించిన మహాత్మా గాంధీజీ 77వ వర్ధంతిని పురస్కరించుకొని ఒంగోలు నగరంలోని పలు సంస్థలు బాపూజీ విగ్రహాలకు,చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం వారు సలిపిన కృషి త్యాగాలను స్మరించుకున్నారు.

**వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో...:** మహాత్మా గాంధీ 78 వ వర్ధంతి సందర్భంగా ఒంగోలులోని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నాయకులు మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు అసెంబ్లీ ఇంచార్జ్ చుండూరి రవి బాబు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, బొట్ల రామారావు, కె వి రమణా రెడ్డి, వై వెంకటేశ్వర రావు, గల్లా దుర్గా, క్రాంతికుమార్, దేవరపల్లి అంజిరెడ్డి,సయ్యద్ అప్సర్, పల్నాటి వెంకటేశ్వర రెడ్డి, చందోలు చెంచి రెడ్డి, పాలడుగు శ్రీనివాస రావు, వెంకయ్య నాయుడు, షేక్ మీరావలి, మధు,యెహన్, గుత్తి కొండ నారపు రెడ్డి, పీటర్,తోటపల్లి రవి,మారుతీ, అమర్, ఖాదర్ బాషా, సాయి చందు, నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

**ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...:** ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఒంగోలు వైశ్య భవన్ ప్రాంగణం లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ ఆర్గనైజింగ్ సెక్రెటరీ పల్లపోతు వెంకటేశ్వర్లు, వాసవి సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు పెనుగొండ శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి మువ్వల శ్రీనివాసులు, ఆర్యవైశ్య నాయకులు కొల్లిపర్లసురేష్, మాజీ ప్రధాన కార్యదర్శి కూరపాటి సత్యనారాయణ, మాగులూరి నాగేశ్వరరావు, నేరెళ్ల శ్రీనివాసరావు, ప్రభాకర్, బాదం మురళి మరియు జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

**వాసవి క్లబ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో...:** ఒంగోలు లోని వాసవి క్లబ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో స్థానిక సీతారాంపురంలోని ఆర్యవైశ్య బాలుర వసతి గృహ ప్రాంగణంలో బాపూజీ గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షులు శిఖాకొల్లి సత్యనారాయణ, వాసవి క్లబ్ సభ్యులు, అధికారులు డి శ్రీను, ఏ సత్యం, సిహెచ్ సత్యం, ఎస్ సత్యం, జీ రంగా, వి అనిల్, సిహెచ్ సుబ్బు, డి చంద్ర, ఎన్ శ్రీను, వాసవి క్లబ్ ఒంగోలు సిటిజన్స్ అధ్యక్షులు శిఖాకొల్లి సత్యనారాయణ, కార్యదర్శి సినిగేపల్లి నాగాంజనేయులు, కోశాధికారి వలేటి ఠాగూర్ పాల్గొన్నారు.

**ప్రజా సంఘాల ఆధ్వర్యంలో..** : భారత స్వాతంత్ర్యోద్యమ మార్గదర్శి మహాత్మా గాంధీ" 2026 జనవరి 30 వ తేదీ మహాత్మా గాంధీ 78వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ఒంగోలు కలెక్టర్ ఆఫీస్ ఎదుట మంచి పుస్తకం షాపు వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగింది. ముందుగా రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య జిల్లా అభివృద్ధి వేదిక అద్యక్షుడు చుండూరి రంగారావు గాంధీ చిత్ర పటానికి ఖద్దరు దండ వేసి, పుష్పాంజలి ఘటించి మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో ఓ.పి.డి.ఆర్. రాష్ట అధ్యక్షులు చావలి సుధాకరరావు, ఎ.ఐ.బి.ఎస్.పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధరణికోట లక్ష్మి నారాయణ, ఐ.ఎల్.పి రాష్ట అధ్యక్షుడు దాసరి సుందరం, రిటైర్డ్ హెడ్ మాస్టర్ జి.మురహరి, టి. వెంకటేశివర్లు, బి.సి నాయకులు గుంటూరు మస్తాన్ రావు, కె.పెద్దన్న, పి.తిరుపతయ్య, బి.సి. సమన్వయ కమిటి జిల్లా అధ్యక్షుడు బొట్ల సుబ్బారావు, న్యాయ వాది జి.కోటిరెడ్డి, ఎస్.హేమలత, డి.బి.ఆర్.ఎస్ నాయకులు కోటేశ్వర్రావు, కె.ఎన్.పి.ఎస్ జిల్లా నాయకులు జార్జి, సుబ్బారావు, ఒ.పి.డి.ఆర్ జిల్లా కార్యదర్శి ఎ.లక్ష్మి ప్రసాదు, వీరపోగు చంద్ర, ఎం.చైతన్య ప్రసాదు, వీసం బాలకృష్ణ తదితరులు సందేశాలు ఇచ్చారు.

**జిల్లా కేంద్ర గ్రంథాలయంలో...:** ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మహాత్మా గాంధీ 78వ వర్ధంతి సందర్భంగా ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఒంగోలుకార్యదర్శి ఎఫ్ ఏ.సీ జివి శివారెడ్డి మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలదండ వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో సంపూర్ణ కాళహస్తి డిప్యూటీ లైబ్రేరియన్ శకుంతల, జూనియర్ అసిస్టెంట్ శ్యామ్ సన్, కృష్ణవేణి,బి. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ రికార్డులలో ఇతరుల అంశంతో ఉన్న భూములను పరిశీలించి అర్హులైన రైతులను గుర్తించాలి

**వీఆర్వోలకు సూచనలు సలహాలు ఇచ్చిన కొమరోలు తాసిల్దార్ భాగ్యలక్ష్మి.**





**కొమరోలు పెన్ పవర్ జనవరి 30.**

రెవెన్యూ రికార్డులలో ఇతరుల తో ఉన్న భూములను పరిశీలించి భూములపై ఉన్న రైతులను గుర్తించేందుకు కృషి చేయాలని కొమరోలు తాసిల్దార్ డి భాగ్యలక్ష్మి వీఆర్వోలను కోరారు. శుక్రవారం కొమరోలు తహల్దార్ కార్యాలయంలో విఆర్వోలతో తాసిల్దార్ భాగ్యలక్ష్మి సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులలో రైతుల పేర్లతో కాకుండా ఇతరులు అనే అంశంతో కూడా కొన్ని భూములు ఉన్నాయని, అలాంటి భూములను పరిశీలించి ఆ భూములపై ఉన్న రైతులను గుర్తించి అర్హులైన రైతుల పేర్లను రెవెన్యూ రికార్డులలో నమోదు చేయాలని ఆమె కోరారు. కార్యక్రమాలను విఆర్వోలు, వీఆర్ఏలు సర్వేయర్ల సహకారంతో త్వరితగతిన పూర్తి నివేదికను తమకు అందజేయాలని ఆమె కోరారు. ఇతరులు అనే అంశంతో ఉన్న భూములు అన్యాక్రాంతమయ్యే అవకాశాలు ఉన్నందువల రాష్ట్ర ప్రభుత్వం అలాంటి భూములను సర్వే చేసి వాస్తవమైన రైతులను గుర్తించి వారికి న్యాయం చేయాలని నిర్ణయించినట్లుగా ఆమె చెప్పారు. ఆ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ వెంకటయ్య ,రీ సర్వే డిప్యూటీ తాసిల్దార్ సిద్దయ్య, మండల సర్వేయర్ జమాల్, వీఆర్వోలు పాండు , హనీషా, రమణ రావు ,పి.వి.రమణ, ఇండ్ల నారాయణ, రాజేశ్వరి, వెంకటేశ్వర్లు ,రంగనాయకులు ,నాయబ్ రసూల్, రంగనాథ్, అంకయ్య పాల్గొన్నారు.

# విద్యా పరిరక్షణ ధర్నాను విజయవంతం చేయండి

**ఆంధ్రప్రదేశ్ విధ్యా పరిరక్షణ కమిటీ ( ఏ పీఎస్ ఈ సి )పిలుపు**



**గిద్దలూరు పెన్ పవర్ జనవరి 30**

విద్యారంగా పరిరక్షణ కోసం, ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలలో మాతృభాషలో విద్యా విధానం కొనసాగాలని, రాష్ట్రాల ఫెడరల్ హక్కులకు భంగం కలిగించే విధంగా ఉన్న నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ విద్యా పరిరక్షణ కమిటీ, అఖిల భారత విద్యా హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1 -2026న విజయవాడ ధర్నా చౌక్ నందు మహా ధర్నా జరుగుతుందని దాని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపిటిఎఫ్) మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై శ్రీనివాసులు ఉపాధ్యాయులను,మేధావులను కోరారు. ధర్నాకు సంబంధించిన కరపత్రాలు గిద్దలూరు ఏపీటీఎఫ్ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వై.శ్రీనివాసులు మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొత్తం విద్యారంగాన్ని తన చెప్పు చేతుల్లోకి పెట్టుకొని, రాష్ట్రాల ఫెడరల్ హక్కులకు భంగం కలిగిస్తుంది అన్నారు.. విధ్యా రంగానికి కేంద్ర బడ్జెట్లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్లో 20 శాతం శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక పాఠశాలల మూసివేతను నిలుపుదల చేయాలన్నారు.. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 50వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల్లో మాతృభాష మాధ్యమాన్ని కొనసాగించాలన్నారు. విద్యా వ్యాపారాన్ని రద్దు చేయాలన్నారు.తదితర డిమాండ్ల సాధన కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న ఈ ధర్నాను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా ఏ . పి.టి.ఎఫ్ ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులు ఎస్ . హుమాయున్ కబీర్ టీ .పాండురంగ స్వామి ఉపాధ్యక్షులు ఎస్ శేషు కుమార్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ సభ్యులు డి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి జి పాండు గిద్దలూరు మండల గౌరవ అధ్యక్షులు ఎస్ ఖాదర్ వలీ, జిల్లా కౌన్సిలర్ ఎం.వి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ చట్టం పరిరక్షణ కోసం కూలీల ప్రతిజ్ఞ

**సి ఎస్ పురం, పెన్ పవర్ జనవరి 30**



మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం చట్టం పరిరక్షణ కోసం మండలంలోని పలువురు కూలీలు శుక్రవారం ప్రతిజ్ఞ చేశారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సిఎస్పురం లోని ఎస్టీ కాలనీ, బీసీ కాలనీ లలో కూలీలు మహాత్మా గాంధీ స్ఫూర్తితో గ్రామీణ పేదలకు, రైతు, కూలీలకు అండగా ఉన్న జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి అందరితో కలిసి నేనూ పోరాడుతానంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పొదిలి నరసింహులు, కూలీలు పోలయ్య, తిరుమలయ్య, నాగమ్మ, రాధ, మరియమ్మ, యేసురత్నం, చిన్నకోటయ్య, కొండయ్య, సుభాషిని, చంటి, గురమ్మ, తిరుపతయ్య, రత్తయ్య, సునీత, శ్యామయ్య, చార్వాణి లు పాల్గొన్నారు.

## జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు కుష్టు వ్యాధి నివారణకై కృషి చేద్దాం

**కొమరోలు లోని గ్రామ సచివాలయాల ప్రాంగణంలో జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాలు.**



**కొమరోలు పెన్ పవర్ జనవరి 30.**

జాతిపిత మహాత్మా గాంధీ ఆశయాల సాధనకై కుష్టు వ్యాధి నిర్మూలనకై ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కొమరోలు గ్రామ సచివాలయాల కార్యదర్శి ఓ ఆర్ రంగ జనార్దన్ రెడ్డి కోరారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం కొమరోలు లోని గ్రామ సచివాలయాల ప్రాంగణంలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు. ఆ సందర్భంగా గ్రామ సచివాలయాల ప్రాంగణంలో గల జాతిపిత విగ్రహానికి జనార్దన్ రెడ్డి, పలువురు సిబ్బంది పూలమాలవేసి నివాళులర్పించారు. ఆ సందర్భంగా రంగ జనార్దన్ రెడ్డి జాతిపిత మహాత్మా గాంధీ దేశానికి స్వాతంత్రం సంపాదించి పెట్టడంలో చేసిన ఉద్యమాలు, పోరాటాలు, కృషిని వివరించారు. అనంతరం ఏఎన్ఎంలు ,ఆశా కార్యకర్తలు ,గ్రామ సచివాలయాల సిబ్బందితో కుష్టు వ్యాధి నివారణకై ప్రతిజ్ఞ చేయించారు. జాతిపిత మహాత్మా గాంధీ కుష్టి వ్యాధిని నివారించేందుకు చేసిన కృషిని గుర్తు చేస్తూ ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆయన కోరారు .ఆ కార్యక్రమంలో మూడు గ్రామ సచివాలయాల సిబ్బంది,ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అద్దంకి మండలంలో 26 పంచాయతీలకు ట్రై సైకిళ్ల పంపిణీ

**పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించిన స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్**



**అద్దంకి ఆర్సీ ఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 30**

అద్దంకి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా 26 గ్రామ పంచాయతీలకు ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ చిన్ని. శ్రీనివాసరావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. వరూధిని ఆధ్వర్యంలో ఈ పంపిణీ కార్యక్రమం జరిగింది. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరచడానికి, చెత్త సేకరణ ప్రక్రియను సులభతరం చేయడానికి ఈ ట్రై సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, పంపిణీ చేసిన వాహనాలను సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రాలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మానవాళి మార్గదర్శి.. "మహాత్మ గాంధీజీ"..

## సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడి కోట్లాది భారతీయులకు స్వేచ్ఛ, స్వాతంత్రాలు అందించిన మన జాతిపిత మహాత్మా గాంధీ -జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి స్వరూప రెడ్డి...



గిద్దలూరు పెన్ పవర్ జనవరి 30

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భాన్ని పురస్కరించుకొని జనవిజ్ఞాన వేదిక లో జరిగిన కార్యక్రమంలో స్వరూపరెడ్డి మాట్లాడుతూ అహింసా వాదంతో ఎంతటి కఠిన లక్ష్యాన్ని చేదించవచ్చునని నిరూపించి, వలసదారుల చెర నుండి అఖండ భారతావనికి విముక్తి కలిగించి ప్రపంచానికి నూతన పోరాట ఒరవడిని నేర్పిన జాతిపిత మహాత్మా గాంధీ అన్నారు. కుల మత వర్గాలకు అతీతంగా సర్వజనుల హితమే తన మతం అని చాటి చెప్పిన మహాత్మా గాంధీ ఆదర్శాలు మనదేశానికి తక్షణ అవసరమన్నారు. జాతి సమగ్రతను, ఐక్యతను నిలబెట్టేందుకు తన జీవితాన్ని అర్పించిన మహాత్మా గాంధీ మన దేశ పురోగమనానికి సదా దిక్సూచి అన్నారు. ఊరికో వీధి, పేరు కాదు గాంధీ.. కరెన్సీ నోటు మీద, నడిరోడ్డు మీద మనము చూస్తున్న బొమ్మ కాదు గాంధీ.. భరతమాత తల రాతను మార్చిన విధాత గాంధీజీ అన్నారు. గాంధీ సిద్ధాంతాలకు కొన్ని పరిమితులు వుండ వచ్చు.ఆయనలో కొన్ని లోపాలు వుంటే వుండవచ్చు.కానీ ఆయన అనుసరించిన అహింసా మార్గం,పాటించిన పరమత సహనం నేటి తరానికి అవసరం.గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన గురించి కొన్ని విషయాలు తెలుసుకుందాం. 1869 అక్టోబర్ 2న గుజరాత్ లోని పోర్బందర్ లో కరంచంద్ పత్లీబాయ్ లకు గాంధీ జన్మించారు. ఆయన పన్నెండవ యేట కస్తూరిబా తో వివాహమైనది.ఇంట్లో ఎంత క్రమ శిక్షణతో పెరిగినప్పటికీ,పాఠశాలలో కొందరు చెడు స్నేహితుల ప్రభావం వల్ల ఆయనకు కొన్ని దురలవాట్లు వచ్చాయి. తర్వాత కాలంలో గాంధీ వాటికి దూరంగా వున్నారు. ఆయన కుటుంబంలో ఏలోటూ లేకపోయినాభారతీయులందరూ హాయిగా జీవించలేకపోతున్నారనే వ్యధ ఎక్కువగా ఉండేది. పైగా తన దేశం పాశ్చాత్యుల చేతుల్లో ఇబ్బందుల పాలవుతున్నారని వాపోయేవారు. భారతీయులను పాశ్చాత్యులు కొల్లగొడుతున్నారని, వారిని వెళ్లగొడితే తప్ప తనకు మనశ్శాంతి ఉండదని స్నేహితులతో అనేవారు. తను ఏంసాధించాలన్నా చదువు అవసరం అని గ్రహించి బారిష్టరు చదువుకు విదేశాలకు వెళ్లారు.అక్కడ ఎటువంటి దురలవాట్లకు బానిస కాకుండా అన్ని పరీక్షలలోను ఉత్తమ శ్రేణిలో పాస్ అవుతూ ఉత్తమ విద్యార్థిగా పేరు పొందారు. చదువు అనంతరం భారత దేశానికి తిరిగి వచ్చి ముంబై హైకోర్టులో



కొంతకాలం న్యాయవాది గా పనిచేసి ధనవంతుల వద్ద తీసుకున్న ఫీజుతో పేదలకు సహాయం చేసి వారి కేసులను ఉచితంగా వాదించేవారు.ఒకసారి ఒక సంస్థ తరపున న్యాయ వాదిగా దక్షిణాఫ్రికా లోని ప్రిటోరియాకు వెళ్లారు. దక్షిణాఫ్రికాలోని భారతీయుల దీనాతిదీన పరిస్థితి ని చూసి గాంధీ గారి హృదయం ద్రవించి పోయింది. అక్కడ భారతీయులపై అనేక ఆకాంక్షలుండేవి.అక్కడ భారతీయుల చీకటి జీవితంలో వెలుగులా అవతరించారు. త్యాగం మూర్తీభవించిన భారతీయులు తమ శ్రమనంతా తెల్లదొరలకు ధారపోసి కూడా ఛీత్కారానికి గురవడం ఇక సాగనివ్వకూడదని భారతీయులనందరిని ఒక సంఘంగానీ స్థాపించి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వానికి పిటీషన్లు పంపనారంభించారు. పొరపాటున కూడా చెయ్యి ఎత్తకండి.ఒక చెంప మీద కొడితే రెండో చెంప చూపించండి.ఎంత కఠిన హృదయుడనైనా మీ చర్య మార్చ గలదు. అహింసే మన ఆయుధం అని వారికి నూరిపోసేవారు. ఆ అహింసావాదం ప్రజలందరినీ ఆశ్చర్యచకితులను చేసింది. 1947 స్వాతంత్రం వచ్చిన తరువాత దేశం భారత్, పాకిస్తాన్ లుగా ఏర్పడటం ఆయన హృదయాన్ని కలచివేసింది. దేశవిభజనతో పాటు మత కల్లోలాలు కూడా విజృంభించాయి. శాంతినవలంబించి మత సామరస్యము కొరకు పాటుపడమని ప్రజలందరినీ మహాత్ముడు హెచ్చరించారు.సరిగా ఇదే సమయంలో నాథూరామ్ వినాయక్ గాడ్సే 1948 వ సంవత్సరం జనవరి 30 తేదీన ఢిల్లీలో బిర్లా భవనమున ప్రార్థన కొరకు వెళుతున్న గాంధీజీని తుపాకీ తో కాల్చి చంపాడు. ఈనాడు మనమధ్య గాంధీ లేరు.మనందరం ఆయన ఆశయాలను అనుసరించడమే మనం ఆయనకు ఇచ్చే ఘన నివాళి. ఆయన ఆశయాలు నాడు ,నేడు, ఏనాడైనా అందరికీ ఆదర్శమే. అందుకే ఆయన మహాత్ముడై మనందరి మనస్సులలో నిలిచారు.

## పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.నాగేశ్వరరావుకు ఘన సన్మానం



సి ఎస్ పురం, పెన్ పవర్ జనవరి 30

మండలంలోని పిల్లిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు కోటపాటి నాగేశ్వరరావు ఈ నెల 31న పదవీ విరమణ చేయనున్న సందర్భంగా శుక్రవారం పాఠశాల ఆవరణలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షేక్ అమీర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఎంఈఓ జె. ప్రసాదరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల నిబద్ధతే విద్యా వ్యవస్థకు బలం అని అన్నారు. కోటపాటి నాగేశ్వరరావు తన సేవా కాలంలో విద్యార్థుల విద్యాభివృద్ధికి అంకితభావంతో పనిచేశారని, పాఠశాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు. ఆయన సేవలు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ నాగేశ్వరరావు విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపారని తెలిపారు. ఆయన మార్గదర్శకత్వంలో పాఠశాల అనేక విద్యా విజయాలు సాధించిందని అన్నారు. అనంతరం ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో కె వి యన్ ఎల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్లస్ 2 ప్రధానోపాధ్యాయులు బోడా ప్రసాద్, పటాన్ మహమ్మద్ రసూల్, ఎస్ఎం షరీఫ్, యుటిఎఫ్ యూనియన్ బాధ్యులు కందేర నాగరాజు, కె వెంకటేశ్వర్లు, జె వెంకట్రావు, ఎస్ టి యు బి. వెంగలరెడ్డి, ఏపీటీఎఫ్ నాయకులు తోట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అహింస మార్గం చూపిన గాంధీజీ అందరికి ఆదర్శం



ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జనవరి 30

దేశ స్వాతంత్ర్య సమూపార్జనలో శాంతియుత మార్గంలో, అహింస అనే ఆయుధంతో తెల్లదొరలను ఎదిరించిన మహాత్మా గాంధీజీ చూపిన అహింస మార్గం అందరికి ఆదర్శం అని వైస్సార్సీపీ జిల్లా సహాయకార్యదర్శి ఒంగోలు మూర్తిరెడ్డి అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య చరిత్రలో ఉద్యమాలు వివిధ రూపాలలో జరిగిన, అహింస మార్గంలో బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించి, భారతీయులను ఏకం చేసారని అన్నారు. గాంధీజీ చూపిన మార్గం నేటి యువతకు ఓ గీటురాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కందూరి కాశీ విశ్వనాథ్,జడ్పీటీసీ చేదురి విజయ భాస్కర్, యస్ వి రమేష్, కందూరి గురు ప్రసాద్,కోప్పర్తి ఓబుల్ రెడ్డి, పబ్బిశెట్టి శ్రీను,కాకుమాను వెంకట సురేష్ బాబు,యస్ వి ప్రసాద్, సయ్యద్ జాబివుల్లా,యక్కలి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## దర్శిగుంటపేట సచివాలయాన్ని సందర్శించిన ఎస్జిఎస్ డబ్ల్యూ అధికారి బ్రహ్మారెడ్డి



సి ఎస్ పురం, పెన్ పవర్ జనవరి 30

మండలంలోని దర్శిగుంటపేట గ్రామ సచివాలయాన్ని శుక్రవారం మండల ఎస్ జి ఎస్ డబ్ల్యూ అధికారి బ్రహ్మా రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ ప్రభుత్వ పథకాల రికార్డులను , సిబ్బంది హాజరును పరిశీలించారు. అనంతరం వాట్సప్ పరిపాలన ఇంటింటి ప్రచారం, అక్షర ఆంధ్ర కార్యక్రమం, యూఎఫ్ఎస్ సర్వే ల అమలుపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి కార్యక్రమం సమర్థవంతంగా అమలవ్వాలని సూచించారు. ఇంటింటి ప్రచారం ద్వారా ప్రభుత్వ పథకాలను ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, అక్షర ఆంధ్ర కార్యక్రమం ద్వారా అక్షరాస్యతను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అన్నారు. అలాగే యూఎఫ్ఎస్ సర్వేను పక్కాగా నిర్వహించి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.పనుల్లో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమాల అమలులో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఒంగోలు పార్లమెంట్ వైసిపి సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని కలిసిన కొమరోలు వైసిపి నేతలు

### భాస్కర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జెడ్పిటిసి సభ్యులు సారె వెంకటనాయుడు, ఎంపీటీసీ సభ్యులు ఎస్ఎం సుభాని. వైసీపీ నేతలకు ధన్యవాదాలు తెలిపిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి.



కొమరోలు పెన్ పవర్ జనవరి 30

ఒంగోలు వైసిపి పార్లమెంటు సమన్వయకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని కొమరోలు జడ్పిటిసి సభ్యులు సారే వెంకట నాయుడు, కొమరోలు ఎంపిటిసి సభ్యులు ఎస్ఎం సుభాని శుక్రవారం ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిశారు. అక్రమమద్యం కేసులో అరెస్టై జైల్లో ఉన్న చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి గురువారం బెయిల్ పై విడుదలయ్యారు .ఆ సందర్భాన్ని పురస్కరించుకొని జడ్పిటిసి వెంకటనాయుడు ,ఎంపీటీసీ సభ్యులు ఎస్ఎం సుభాని తదితర వైసీపీ నేతలు గురువారం ఒంగోలు కి వెళ్లి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. తన మీద ఉన్న అభిమానంతో ఒంగోలుకు వచ్చి తనను కలవడం తనకు సంతోషంగా ఉన్నదని అంటూ, కొమరోలు మండలంలో వైసీపీ అభివృద్ధి, కార్యకర్తల యొక్క క్షేమాలు గురించి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెంకట నాయుడు ,ఎస్ఎం సుభాని ని అడిగి తెలుసుకున్నారు. త్వరలో తాను జిల్లా వ్యాప్తంగా పర్యటించి వైసీపీ నేతలు కార్యకర్తలను కలుసుకుంటానని భాస్కర్ రెడ్డి తెలిపారు. 2029 లో జరిగే సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రి చేసుకొనే లక్ష్యంతో పార్టీని గ్రామస్థాయి నుంచి అభివృద్ధి చేయుటకు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని ఆయన కోరారు. కొమరోలు మండలం 2011 నుంచి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని ,ఆ కంచుకోటను పదిలంగా ఇలాగే కొనసాగిస్తూ ,రాబోవు సార్వత్రిక ఎన్నికలలో కొమరోలు మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కి కంచుకోట అని ,మరోసారి రుజువు చేసుకుంటామని వెంకట నాయుడు, ఎస్ఎం సుభాని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి వివరించారు .ఆ కార్యక్రమంలో జిల్లా వైసీపీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి తదితర వైసీపీ నేతలు పాల్గొన్నారు.

## అద్దంకిలో "స్పర్శ" కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాలు

### కుష్టు వ్యాధి వివక్ష లేని సమాజమే లక్ష్యం: డాక్టర్.. జయసింహ, హర్ష



అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 30:

అద్దంకి పట్టణం గాజులపాలెం అర్బన్ హెల్త్ సెంటర్, అద్దంకి మండలం తిమ్మాయపాలెం పీ.హెచ్.సి కేంద్రాలలో "స్పర్శ" కుష్టు వ్యాధి అవగాహన కార్యక్రమాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్. జయసింహ, డాక్టర్. హర్ష మాట్లాడుతూ, మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని నేటి నుండి ఫిబ్రవరి 13వ తేదీ వరకు ఈ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తుల పట్ల సమాజంలో ఉన్న వివక్షను పోగొట్టి, వారిని గౌరవంగా చూడడమే ఈ స్పర్శ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని వారు పేర్కొన్నారు. గాజులపాలెం, తిమ్మాయపాలెం గ్రామాలలో జరిగిన ఈ కార్యక్రమాల్లో ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో కలిసి కుష్టు వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే శాశ్వత అంగవైకల్యం కలగకుండా అడ్డుకోవచ్చని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో దీనికి ఉచితంగా వైద్యం మరియు మందులు అందుబాటులో ఉన్నాయని వైద్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## రావినూతల గ్రామంలో పశు ఆరోగ్య శిబిరం

### పశువులకు విస్తృతంగా వైద్య పరీక్షలు, మందుల పంపిణీ



అద్దంకి ఆర్సి ఇంచార్జి, పెన్ పవర్, జనవరి 30:

కొరిశపాడు మండల పరిధిలోని రావినూతల గ్రామంలో శుక్రవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో పశు వైద్యాధికారి డాక్టర్ ఎం. రాంబాబు గ్రామంలోని పాడి పశువులకు వివిధ రకాల వైద్య సేవలు అందించారు. మొత్తం 42 సాధారణ వ్యాధులకు మరియు 9 గర్భకోశ సంబంధిత వ్యాధులకు వైద్యులు చికిత్స అందించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. అలాగే 5 పశువులకు సూది పరీక్షలు నిర్వహించి రైతులకు తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. పశువులతో పాటు గొర్రెలు, మేకల ఆరోగ్య సంరక్షణపై కూడా ఈ శిబిరంలో ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా 14 దూడలు, 11 పెద్ద పశువులతో పాటు 32 మేకలకు నట్టల నివారణ మందులను వేశారు. అదేవిధంగా గొర్రెలు, మేకలకు వివిధ రకాల అంటువ్యాధులు సోకకుండా ముందస్తుగా టీకాలు వేశారు. డాక్టర్ ఎం. రాంబాబు మాట్లాడుతూ.. రైతులు తమ పశువుల ఆరోగ్యం పట్ల నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వం కల్పిస్తున్న ఇటువంటి ఉచిత వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ చట్టం కోసం ఉద్యమం - సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి

కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు జనవరి 30

ఎన్నో ఉద్యమాల ఫలితంగా సాధించిన మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధిహామీ చట్టాన్ని బిజెపి ప్రభుత్వం విబిజిఆర్ఏఎంజి పేరుతో నిర్వీర్యం చేస్తే సహించేది లేదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డి రమాదేవి స్పష్టం చేశారు. శుక్రవారం నాడు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు ఉద్యమం చేపట్టాలని డిమాండ్ చేస్తూ బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ వద్ద చేపట్టిన ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రమాదేవి మాట్లాడుతూ గ్రామీణ పేదలకు ఉపాధి భరోసా కల్పించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంఎన్ఆర్ఈజీఎస్) చట్టాన్ని బిజెపి ప్రభుత్వం సవరణ పేరుతో నిర్వీర్యం చేసే చర్యలను ఆమె తీవ్రంగా తప్పు పట్టారు. కేంద్రం అనుసరిస్తున్న చర్యలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. 125 రోజులు పనులు కల్పన పేరుతో కేంద్రం వాటాను గణనీయంగా తగ్గించి, రాష్ట్రాల వాటాను పెంచుతూ సవరించిన చట్టం గ్రామీణ పేదలకు శరాఘాతమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం కేవలం వ్యవసాయ కూలీలకు మాత్రమే నిర్దేశించినది కాదన్నారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థకు పట్టుగొమ్మగా నిలవడంతో పాటు సాగునీరు, తాగునీరు వనరుల అభివృద్ధికి దోహద పడిన వైనాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేంద్రం ఉపాధి హామీ చట్టం అమలుకు రూ 2లక్షలు కోట్లు కేటాయించాలని, పథకాన్ని యధాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధిహామీ




చట్టం పరిరక్షణకు పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవడానికి అందరితో కలసి పోరాడతామని ప్రతిజ్ఞ చేయించారు. తొలుత నాయకులు గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు,సయ్యద్ హనీఫ్, జివి కొండారెడ్డి, ఎం రమేష్, డి సోమయ్య,జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు,జె జయంతి బాబు,బి రఘురామ్, వి బాలకోటయ్య,బంకా సుబ్బారావు, జి బాలనాగయ్య,ఊసా వెంకటేశ్వర్లు, కెజి మస్తాన్, డి కే ఎం రఫీ, వి ఆంజనేయులు, కె మాల్యాద్రి, పిసి కేశవరావు, జి రమేష్, కె రమాదేవి, పి కల్పన, ఉబ్బా ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మేదరమెట్లలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు, ఇండోర్ కోర్టు మంజూరుకు మంత్రి గొట్టిపాటి సానుకూలత



అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 30

కొరిశపాడు మండలం, మేదరమెట్ల గ్రామంలో స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, యువత కోసం షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ కోర్టును మంజూరు చేయాలని కోరుతూ గ్రామ యువకులు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ను కలిశారు. శుక్రవారం మంత్రిని కలిసి గ్రామంలోని పలు సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించి వినతిపత్రం అందజేశారు. గ్రామ పెద్దల ఆమోదంతో సాధ్యసాధ్యాల పరిశీలన విగ్రహ ఏర్పాటుపై మంత్రి స్పందిస్తూ, గ్రామ పెద్దలందరితో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన అనువైన ప్రదేశాన్ని సూచిస్తే తప్పకుండా విగ్రహ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్థానిక కొరిశపాడు పోలీస్ స్టేషన్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని యువకులు మంత్రికి ప్రతిపాదించగా, మరోసారి గ్రామస్తులతో చర్చించి, స్థలాన్ని పరిశీలించి వస్తే అనుమతులు మంజూరు చేసే విధంగా ప్రయత్నిస్తానని తెలిపారు. అదేవిధంగా గ్రామంలో క్రీడాకారుల సౌకర్యార్థం షటిల్ బ్యాడ్మింటన్ ఇండోర్ కోర్టును మంజూరు చేయాలని యువత కోరగా, దీనిపై కూడా మంత్రి సానుకూలంగా స్పందించారు. సాధ్యసాధ్యాలను పరిశీలించి త్వరలోనే తగిన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మేదరమెట్ల గ్రామ యువకులు, ఎన్టీఆర్ అభిమానులు ఉన్నారు.

## ఇంటి పన్ను వసూళ్లతో పంచాయతీ అభివృద్ధి సాధ్యం

### గ్రామ సచివాలయాల సిబ్బందికి సూచనలు సలహాలు ఇచ్చిన జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు



కొమరోలు పెన్ పవర్ జనవరి 30

గ్రామపంచాయతీల అభివృద్ధికి ఇంటి పన్నుల వసూలు వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు కోరారు. శుక్రవారం అయిన కొమరోలుకు వచ్చిన సందర్భంగా కొమరోలు లోని మండల పరిషత్ సమావేశపు హాలులో గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు .ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,ఇంటి పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని ,తద్వారా గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. ఇంటి పన్నులను ఆన్లైన్ విధానం ద్వారా, ముఖ్యంగా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పారదర్శకత వసూలతో గ్రామపంచాయతీలో ఆదాయ వనరులు పెరుగుదలవని ,అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని పేర్కొన్నారు. ఇంటిపన్నుల వసూళ్ల ప్రచారంలో భాగంగా ప్రధాన వీధుల్లో స్టిక్కర్లు అతికించడం ద్వారా ,ఇంటి పన్ను వసూలు పురోగతి, వేగవంతం అవుతాయని ఆయన పంచాయతీ కార్యదర్శులకు గ్రామ సచివాలయ సిబ్బందిని సిబ్బందికి వివరించారు. ఇంటి పన్నుల వసూళ్లలో వెనుకబడిన పంచాయితీలు ఇప్పటినుంచైనా ఇంటి పనుల వసూళ్లను వేగవంతం చేయాలని కోరారు. ఇంటి పనుల వసూలలో నిర్లక్ష్యం చేసే సిబ్బందిపై శాఖపరమైన చర్యలు తీసుకోవలసి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు ఎంపీడీవో చెన్నారావు, డిప్యూటీ ఎంపీడీవో ,గ్రామ సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

## మీ కోసం తాత్కాలికంగా రద్దు

### - జిల్లా రెవెన్యూ అధికారి

కలెక్టరేట్ ఒంగోలు ,పెన్ పవర్ జనవరి 30

ప్రకాశం జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరు కార్యాలయ ఆవరణలో గల ప్రజా సమస్యల పరిష్కార, వేదిక మీటింగ్ హాలు నందు జరగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజి ఆర్ఎస్) కార్యక్రమము ప్రకాశం జిల్లా అవతరణ దినోత్సవం సందర్భంగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి బి. చిన ఓబులేసు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున జిల్లాలోని సుదూర ప్రాంత ప్రజలందరూ ఈ విషయాన్ని గమనించవలసిందిగా తెలియచేశారు.

# హామీలు గాల్లోకి.. రెడ్ బుక్ రాజ్యాంగం అమల్లోకి

## - ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 30**

కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని మాత్రమే పూర్తి స్థాయిలో అమలు చేస్తుందని ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోపించారు. మద్యం కేసులో బెయిల్ పై విడుదల అయిన చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఒంగోలు వచ్చిన సందర్భంగా ఆయనకు వైసీపీ శ్రేణులు స్వాగతం పలికారు. వైకాపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కక్ష్య సాధింపు చర్యల్లో భాగంగా అనేక మంది వైసీపీ నాయకులు కార్యకర్తలను జైళ్లకు పంపుతున్నారని అన్నారు. పార్టీలో క్రియాశీలకంగా ఉన్న నాయకులను జైలుకు పంపుతున్నారని ఇప్పటికే చంద్రబాబు ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత మొదలైందన్న ఆయన ఒంగోలు నుంచే కూటమి ప్రభుత్వం పై తిరుగుబాటు మొదలవుతుందని తెలిపారు. జనసేన,టిడిపి ఎమ్మెల్యేలు అందరూ అక్రమ సంబంధాల పనిలో నిమగ్నమయ్యారని విమర్శించారు. ఊహలతో కూడిన రాజధాని కాకుండా ప్రజలు మెచ్చే రాజధాని నిర్మించాలని ఆయన




సూచించారు.సమావేశంలో జడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ,జిల్లా పార్టీ అధ్యక్షులు దర్శి శాసనసభ్యులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, వై.పాలెం శాసన సభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్,నియోజవర్గాల సమన్వయకర్తలు ఆధుమూలపు సురేష్, చుండూరి రవిబాబు,దద్దాల నారాయణ,నాగార్జున రెడ్డి, అన్నా



రాంబాబు, పార్టీ రాష్ట్ర నాయకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న పాల్గొన్నారు.

## శంకర్ రెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించిన మాజీ మంత్రి మానుగుంట



**కందుకూరు పెన్ పవర్, జనవరి 30**

మాజీ పిడిసిసి బ్యాంకు చైర్మన్ మేదరమెట్ల శంకర్ రెడ్డి పార్థివ దేహానికి ఆయన స్వగృహం బద్దిపూడి గ్రామంలో మాజీ మంత్రి మానుగుంట మహీధర్ రెడ్డి నివాళులర్పించారు. శంకర్ రెడ్డి తో తనకు ఎప్పటినుంచో సాన్నిహిత్యం ఉందని ఆయన మరణం ఎంతో బాధాకరమని అన్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మహీధర్ రెడ్డి వెంట ఆయన అనుచరులు ఉన్నారు.

## స్మార్ట్ జెన్ స్కూల్లో అమరవీరులకు నివాళి



**సింగరాయకొండ పెన్ పవర్, జనవరి 30**

సింగరాయకొండ లోని స్మార్ట్ జెన్ స్కూల్లో అమరవీరుల దినోత్సవం సందర్భంగా మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని, నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ డా. గీతా రాణి అమరవీరుల దినోత్సవం గురించి మాట్లాడుతూ, మన దేశ స్వాతంత్రం, సమాజ శాంతి, ప్రజల భద్రత కోసం తమ ప్రాణాలను త్యాగం చేసిన మహనీయులను స్మరించుకునే రోజు. ఈరోజు మనమంతా గర్వంతో కూడిన కన్నీళ్ళతో అమరవీరుల దినోత్సవాన్ని స్మరించుకుంటున్నాం. గాంధీజీ అనుసరించిన అహింసా మార్గాన్ని, సత్యం, శాంతి వంటి విలువలను నేటి యువత తప్పనిసరిగా అనుసరించాలని, వారి త్యాగాలను స్మరించుకోవడంతోపాటు, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా మారడమే వారికి మనం చేసే నిజమైన నివాళి అని అన్నారు. వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత మనందరిదే అని ప్రతిజ్ఞ చేద్దాం అని ప్రసంగించారు.

## మేదరమిట్ల శంకరరెడ్డికి నివాళులు అర్పించిన నన్నం పోతురాజు

### మంచి వ్యక్తిని కోల్పోయామని భావోద్వేగం





**ఉలవపాడు, పెన్ పవర్, జనవరి 30:**

సీనియర్ నాయకులు, మృదుస్వభావి, సహకార సంఘ సొసైటీ మాజీ చైర్మన్, వైస్ జడ్పీటీసీ మేదరమిట్ల శంకర్ రెడ్డి పార్థీవ దేహానికి మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నన్నం పోతురాజు, మరికొందరు నాయకులు శుక్రవారం ఆయన సొంత ఊరు బద్దిపూడి గ్రామం వెళ్లి ఘన నివాళులు అర్పించారు. శంకర్ రెడ్డి పార్థీవదేహానికి పూలమాలలు వేసి , ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని, మంచి వ్యక్తిని కోల్పోయామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నన్నం పోతురాజుతో పాటు ఐ.టి వింగ్ అధ్యక్షులు అమర్ నాథ్ రెడ్డి, మండల నాయకులు మానం సుబ్బారావు, చేజర్ల వెంకటరామిరెడ్డి, ముస్లిం మైనారిటీల అధ్యక్షులు సయ్యద్ దస్తగిరి, సోషల్ మీడియా అధ్యక్షులు ఆలూరి మదు, యువజన విభాగం కార్యదర్శి ముచ్చాల పరమేష్ రెడ్డి మరియు బద్దిపూడి గ్రామ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకంలో గాంధీ పేరు కొనసాగించాలి




**పామూరు, పెన్ పవర్, జనవరి 30**

జాతీయ గాంధీ ఉపాధి హామీ పథకాన్ని తిరిగి కొనసాగించాలని సిపిఎం మండల కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా అన్నారు. శుక్రవారం నెల్లూరు రోడ్ లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలవేసి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పథకాలను సొంత పథకాలుగా మార్చుకోవటం నరేంద్ర మోడీకి మారిందని ఆరోపించారు. పని దినాలు తగ్గించి పేదల పొట్ట కొడుతున్నాడని ఆరోపించారు. రాబోయే ఎన్నికలలో బిజెపి ప్రభుత్వానికి దేశ ప్రజలు తగిన బుద్ధి చెప్పి రోజులు దగ్గర పడ్డాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో యాట వీరనారాయణ, బత్తుల నాగేశ్వరావు, షేక్ అల్లాబక్షు, కే శంకర్, టి శ్రీను, సయ్యద్ షమీ, రమీజా, ఖాదరన్నిష, కొండమ్మ, కే ధనలక్ష్మి, పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జనవరి 30**

11కెవి లాయర్ పేట ఫీడర్, 11 కెవి విఐపి ఫీడర్ , గాంధీ పార్క్ పక్కన నూతనముగా విద్యుత్ టవర్ లైన్ నిర్మాణం జరుగుతున్నది, వంట కాలనీ,మీరావలి బేకరీ, గాంధీ పార్క్ మెయిన్ గేట్ , మాంటిసోరి స్కూల్ , కొండయ్య బొంకు, సాయిబాబా టెంపుల్ , గాయత్రి మందిరం , బెథూన్ నర్సింగ్ హోమ్, విన్నకోట వారి వీధి, ఖద్దరు ఆఫీసు రోడ్, సిద్ధ రాఘవరావు, బజార్, ఉమామహేశ్వర కాలేజ్ , ఏరియాలలో శనివారం ఉదయం 11.00 గంటల నుండి సాయంత్రం 05.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఒంగోలు డిఈఈ పాండు రంగారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

## గ్రామస్థాయి వైఎస్ఆర్సిపి అభివృద్ధిపై దృష్టి పెడతాం

### వైఎస్ఆర్సిపి పార్టీ మండల కన్వీనర్ గంటా వెంకటరమణారెడ్డి



**పెద్ద దోర్నాల పెన్ పవర్ జనవరి 30**

గ్రామస్థాయిలో వైఎస్ఆర్సిపి మరింత బలోపేతానికి చేసేందుకు పార్టీ శ్రేణులు సమిష్టిగా కృషి చేయాలని వైఎస్ఆర్సిపి పార్టీ మండల కన్వీనర్ గంట రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చింతల గిరిజన గూడెంలో యర్రగొండపాలెం శాసనసభ్యులు , వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ గారి ఆదేశాలు మేరకు గ్రామస్థాయిలో వైస్సార్సీపీ పార్టీని మరింత బలోపేతం చేయుటకు గ్రామ కమిటీల నియామక కార్యక్రమంలో భాగంగా వైస్సార్సీపీ నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్సిపి మండల పార్టీ కన్వీనర్ అండ్ వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి,గ్రామస్థాయిలో పార్టీని మరింత బలంగా నిలబెట్టే విధంగా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.పార్టీ బలోపేతంలో ప్రతి కార్యకర్త పాత్ర అత్యంత కీలకమని,గ్రామస్థాయి నుంచి ప్రజలతో బలమైన అనుబంధం పెంచుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు.అదేవిధంగా చింతల గూడెంలో సంబంధించిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీలు నిర్మాణాన్ని వివరించారు.పార్టీ ని మరింత పటిష్టం చేస్తూ,భవిష్యత్తు పోరాటాలకు సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మ యలేష్ పద్మజ. నియోజవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు వెన్న వెంకటేశ్వర రెడ్డి,చిన్న గుడిపాడు సర్పంచి వల్లపునేని పవన్ కుమార్, మండల వాణిజ్య విభాగం అధ్యక్షులు రావిక్రింది రామారావు,చింతల సర్పంచి భూమిని వెంకటయ్య, మాజీ ఎంపీటీసీ కుదుమల పోతన్న, వైఎస్ఆర్ సీపీ కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## పి. గుడిపాడుకు తీరిన విద్యుత్ కష్టాలు.. మంత్రి ఆదేశాలతో మారిన రూపురేఖలు

### రూ.1.06 కోట్లతో విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ

**అద్దంకి ఆర్సి ఇంచార్జ్, పెన్ పవర్, జనవరి 30:**

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ చొరవతో కొరిశపాడు మండల పరిధిలోని, పి.గుడిపాడు గ్రామంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. రూ.1.06 కోట్ల భారీ నిధులతో చేపట్టిన విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ పనులు పూర్తి కావడంతో గ్రామస్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత ఏడాది నవంబర్ 28న మంత్రి గొట్టిపాటి రవికుమార్ గ్రామాన్ని సందర్శించిన సమయంలో, నిరంతర విద్యుత్ అంతరాయాలు, శిథిలావస్థకు చేరిన విద్యుత్ లైన్ల గురించి గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన మంత్రి, యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈ.ఈ) నల్లూరి. మస్తాన్ రావును ఆదేశించారు.

**మంత్రి చొరవతో నూతన స్తంభాలు, లైన్ల ఏర్పాటు**

మంత్రి ఆదేశాల మేరకు అధికారులు గ్రామంలో పాతబడిన స్తంభాలను తొలగించి, వాటి స్థానంలో కొత్తగా 355 విద్యుత్ స్తంభాలను, నూతన విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, గ్రామానికి నిరంతర త్రీ-ఫేస్ విద్యుత్ సరఫరాను అందించేందుకు రెండు 100 కెవిఏ, ఒక 63 కెవిఏ ట్రాన్స్ఫార్మర్లను బిగించి వ్యవస్థను పటిష్టం చేశారు. ఈ పనులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం



ఎస్.సి. కాలనీలో ఈ.ఈ మస్తాన్ రావు, గ్రామ టీడీపీ నేతలు కలిసి ఈ నూతన వ్యవస్థను ప్రారంభించారు. దశాబ్దాల నాటి తమ సమస్యను పరిష్కరించిన మంత్రికి గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొట్టే. రవీంద్ర, మందా. నాగేశ్వరావు, అద్దంకి డీఈఈ ఎం. దామోదరం, ఏఈ ఎం. శ్రీనివాసరావు గ్రామస్తులు పాల్గొన్నారు.

## లెప్రసీ రోగులపై వివక్షను వీడాలి - డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు




**కార్పొరేషన్ పెన్ పవర్ , ఒంగోలు జనవరి 30**

లెప్రసీ పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని, సమయానికి గుర్తించి చికిత్స అందిస్తే వైకల్యం నివారించవచ్చని, రోగులపై ఉన్న అపోహలు, వివక్షను తొలగించి వారికీ గౌరవంతో కూడిన జీవన విధానం అందించాల్సిన అవసరం ఉందని అందరికీ ఉందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. టి. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీ వర్ధంతి, యాంటీ లెప్రసీ డే సందర్భంగా మాతా శిశు హాస్పిటల్ టిహెచ్ వార్డు లో స్పర్శ్ లెప్రసీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. "వివక్షతను అంతం చేయడం -- గౌరవాన్ని కాపాడటం" అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. టి. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదనపు జిల్లా వైద్య శాఖాధికారి డా. బాలాజీ, డి సి హెచ్ ఎస్ డా. సూరిబాబు, ఎంసిహెచ్ సూపరింటెండెంట్ వెంకట రావు, డెర్మటాలజీ విభాగాధిపతి డా. యెదుకొండలు లెప్రసీ అవగాహన కార్యక్రమాల ప్రాధాన్యత గురించి ప్రసంగించారు. స్పర్శ్ -- లెప్రసీ అవగాహన కార్యక్రమం భాగంగా పోస్టర్ ను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా. వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. లెప్రసీ పేషెంట్స్కు సేవా సామగ్రి (దుప్పట్లు, టవల్స్, నిమ్ ఆయిల్, మందులు, ఆహార కిట్లు, పండ్లు) దాతలచే విరాళంగా అందించారు. కాకతీయ సేవా సమితి నాయకులు బెజవాడ వెంకట రావు, ఒంగోలు లయన్స్ క్లబ్ అధ్యక్షులు పబ్బిశెట్టి రాజేష్, ఒంగోలు (ఫ్యామిలీ క్లబ్ కార్యదర్శి టి. పాండు రంగారావు, రెడ్ క్రాస్ రాఘవ, టిహెచ్ మెడికల్ ఆఫీసర్లు, డిఎల్ఓ కార్యాలయ సిబ్బంది, టిహెచ్ వార్డు సిబ్బంది, లెప్రసీ పేషెంట్స్ పాల్గొన్నారు.

## చెవిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన వెన్నా హనుమారెడ్డి

**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ జనవరి 30**

వైఎస్ఆర్ సీపీ ప్రధాన కార్యదర్శి, ఒంగోలు పార్లమెంటు ఇంచార్జ్, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిపై అక్రమ మద్యం కేసులో ఊరట లభించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన ఒంగోలులోని వైయస్సార్ సిపి పార్టీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను వైఎస్ఆర్ సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్ వెన్నా హనుమారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం హనుమాన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ చెవిరెడ్డి పై టీడిపి ప్రభుత్వం అక్రమ కేసును పెట్టడమే కాకుండా, తన కుటుంబ సభ్యులపై కేసులు పెట్టి వేధించడం దారుణమన్నారు. అక్రమ మద్యం కేసులో చెవిరెడ్డి పై చంద్రబాబునాయుడు సిట్ వేసి అభియోగాలు మోపిందన్నారు. ఈ క్రమంలో గత ఏడాది జూన్ 17న బెంగళూరులో అరెస్టు చేశారన్నారు. అయితే విచారణలో చెవిరెడ్డి పై ఎలాంటి ఆధారాలు చూపించలేక పోయిందన్నారు. దీంతో సుమారు 226 రోజులు పాటు విజయవాడ జైల్లో రిమైండ్ ఖైదీగా ఉన్న చెవిరెడ్డిని విడుదల చేయాలంటూగురువారం ఏపీ హైకోర్టు బెయిల్ మంజూరు చేసిం




దని తెలిపారు. ప్రజల పక్షాన పోరాడే క్రమంలో ఇలాంటి వేధింపులు తప్పవని, వాటిని ధీటుగా ఎదుర్కొంటూ ముందుకు సాగుతామని ఆయన అన్నారు.

## వృద్ధులకు వితంతులకు చీరలు పంపిణీ

**పెద్ద దోర్నాల పెన్ పవర్ జనవరి 30**

మండల పరిధిలోనితిమ్మాపురం గ్రామం ఎస్సీ పాలెం చర్చిలో క్రిస్టమస్ పండుగ జనవరి లాస్ట్ రోజు సందర్భంగా సేఫ్టీ డ్రైవర్ అసోసియేషన్ అధ్యక్షులు షేక్ షేక్షావలి ఎస్సీ వృద్ధులకు వితాంతులు వితంతులకు 30 చీరలు శుక్రవారం చర్చిలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చర్చి పాస్టర్ ఏసుదానం షేక్ షేక్షావలి సాలవతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాస్టర్ ఏసుదానం. షేక్ మౌలాలి. షేక్ సర్దార్,షేక్ మున్నా, షేక్ చాంద్, దాసు, షేక్ అబ్దుల్లా, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## నేడు దద్దవాడ గ్రామంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి

**దద్దవాడ గ్రామ సచివాలయంలో చెత్త సేకరణ ట్రాక్టర్లను ప్రారంభించనున్న ఎమ్మెల్యే ముత్తుముల.**

**ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పర్యటన విజయవంతం చేయాలని దద్దవాడ తెలుగుదేశం పార్టీ నాయకులు బిజ్జం వెంకట్రామిరెడ్డి, బిజ్జం రవీంద్రారెడ్డి విజ్ఞప్తి.**

**కొమరోలు పెన్ పవర్ జనవరి 30.**



గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ఈనెల 31వ తేదీ శనివారం కొమరోలు మండలం దద్దవాడ గ్రామంలో పర్యటించి సామాజిక పెన్షన్లను పంపిణీ చేస్తారని దద్దవాడ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బిజిజం వెంకట్రామిరెడ్డి, ఎదమకల్లు సహకార సంఘం చైర్ పర్సన్ బిజ్జం రవీంద్రారెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సౌకర్యార్థం సామాజిక పెన్షన్లను 4,000 రూపాయలకు పెంచి పంపిణీ చేస్తున్నదని వారు తెలిపారు. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం రావడంతో పెన్షన్ దారుల సౌకర్యార్థం ఒకరోజు ముందుగానే సామాజిక పెన్షన్ల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని, ఆ మేరకు ఈనెల 31వ తేదీ శనివారం సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరగనున్నదని వారు చెప్పారు. అందులో భాగంగా దద్దవాడ గ్రామ సచివాలయం పరిధిలో గల సామాజిక పెన్షన్దారులకు పెన్షన్లు పంపిణీ చేసేందుకు గిద్దలూరు శాసనసభ్యులు శనివారం దద్దవాడ గ్రామానికి రానున్నారని, ఉదయం 8 గంటల నుంచి సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపడతారని వారు చెప్పారు. అనంతరం 9 గంటలకు దద్దవాడ గ్రామ సచివాలయంలో ఏర్పాటుచేసిన నూతన చెత్త సేకరణ ట్రాక్టర్ ను ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రారంభిస్తారని వారు పేర్కొన్నారు. కావున కొమరోలు మండలంలోని తెలుగుదేశం ,జనసేన, బిజెపి పార్టీల నేతలు ,కార్యకర్తలు కూటమి పార్టీల అభిమానులు, ప్రజలు హాజరై ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పర్యటనలు విజయవంతం చేయాలని వెంకట్రామిరెడ్డి, రవీంద్రారెడ్డి కోరారు.

## చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జనవరి 30**

ఒంగోలు పార్లమెంట్ ఇంచార్జి, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రకాశం జిల్లా కేంద్రానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. చెవిరెడ్డి పై కూటమి ప్రభుత్వం అక్రమ లిక్కర్ కేసులు పెట్టి 226రోజులు జైల్లో పెట్టిన విషయం తెలిసిందే. ఒంగోలు పార్లమెంటుకు బాధ్యత వహిస్తున్న చెవిరెడ్డి బెయిల్ పై రావడంతో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ కలిశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి కుట్రలను చేదించుకుని, చెవిరెడ్డి విడుదల అయ్యారని, ప్రజల పక్షాన నిలబడి పోరాడుతు కూటమి ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తున్న వైస్సార్సీపీ నాయకులపై కేసులు పెడుతున్నారని, కేసులకు భయపడే ప్రసక్తిలేదని అన్నారు. కూటమి కుట్రలను ప్రజలు గమనిస్తున్నారని, జగనన్న పాలనకోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.ఎమ్మెల్యే తో పాటు యర్రగొండపాలెం నియోజక వర్గనాయకులు చెవిరెడ్డి ని కలిశారు.

## కుష్టి వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం



**పొన్నలూరు పెన్ పవర్ జనవరి 30**

స్థానిక సచివాలయంలో శుక్రవారం కుష్టి వ్యాధి నివారణ పై అవగాహన కార్యక్రమం వైద్య అధికారి కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించారు.ప్రపంచ కుష్టు వ్యాధి నిర్మూలన దినోత్సవం మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా పొన్నలూరు గ్రామ సచివాలయం లో గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.అనంతరం కృష్ణ చైతన్య మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు చేతుల నుండి వస్తువులు జారిపోవడం, అందమైన మెరిసే జిడ్డు గల చర్మం గలవారు, అరచేతి కాళ్లు లలో స్పర్శ లేకపోవడం చర్మంపై రాగి రంగు మచ్చలు మొదలగు లక్షణాలు ఉన్న వారికోసం సర్వే నిర్వహించడం జరుగుతుందని అన్నారు.కనుక మండలంలోని ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు రవికిరణ్, మల్లికార్జున రావు సిహెచ్ ఓ భాస్కర్ రావు, హెచ్ ఓ సురేష్ నాయకులు మండవ ప్రసాద్, మాజీ సర్పంచ్ మండవ రామయ్య , పంచాయతీ కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com